# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 11 సంచిక: 282 శుక్రవారం 02-05-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


ముంబయి డబుల్ హ్యాట్రిక్..



8లో..

# ప్రధాని పర్యటనపై కోటి ఆశలు

- అమరావతి పునర్నిర్మాణం వేళ..
- మోదీ కురిపించే వరాలెన్ని?
- 2017నాటి రోజులను గుర్తు చేసుకుంటున్న జనం
- నాడు మట్టి, నీళ్లు ఇచ్చి వెళ్లిన ప్రధాని



జర్నలిస్ట్ డైరీ, విజయవాడ (మే 01):
అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి సంబంధించి నేడు కీలక ఘట్టం ప్రారంభం కానుంది. మే 2న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అయితే అమరావతి రాజధానికి సంబంధించి ప్రధాని మోదీ వరాలు ప్రకటిస్తారని భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం నుంచి సరైన సాయం అందుతూ వస్తోంది. బడ్జెట్లో నిధుల కేటాయింపు తో పాటు కీలక ప్రాజెక్టులను సైతం కేంద్రం మంజూరు చేసింది. అయితే ఇప్పుడు నేరుగా మోదీ అమరావతిలో అడుగుపెడుతుండడంతో.. భారీ వరాలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికే ఏపీ ప్రభుత్వం నుంచి ప్రధానికి వినత్తులు అందినట్లు సమాచారం. ప్రధాని అమరావతి వేదికగా కీలక ప్రకటన చేస్తారని అంచనాలు కూడా ఉన్నాయి. అయితే గత అనుభవాల దృష్ట్యా.. అమరావతికి నిధులు ఇస్తారా? లేకుంటే వేరే రూపంలో సాయం ప్రకటిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. 2017లో అమరావతి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు ప్రధాని నరేంద్ర మోడీ ఆ సమయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ సైతం హాజరయ్యారు. అప్పట్లో అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ భారీ వరాలు ప్రకటిస్తారని అంతా భావించారు. నిధులు ప్రకటిస్తారని కూడా అంచనా వేశారు. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. పవిత్ర నదుల నుంచి తెచ్చిన నీరు, మట్టితో సరిపెట్టారు. అటు తరువాత విపక్షాల నుంచి సటైర్స్ వినిపించాయి. విపక్ష నేతలు ప్రధాని తీరును తప్పపట్టారు. 2018లో ఎన్డీఏ నుంచి చంద్రబాబు బయటకు వచ్చిన సమయంలో సైతం దీనిపై మాట్లాడారు.

మిగతా 2వ పేజీలో..




# పత్యం పాటించాలి!



- ఆర్థిక పరిస్థితి అస్సలు బాలేదు
- దయచేసి అర్థం చేసుకోండి!
- సమ్మె ఆలోచన విరమించండి!
- ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- కేసీఆర్ ఆర్థిక విధ్వంసానికి పాల్పడ్డాడు
- ఖజానా అంతా లూటీ చేసినా సంక్షేమం ఆగలేదు
- రవీంద్రభారతి మే డే వేడుకల్లో సీఎం రేవంత్

జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 01):
కేసీఆర్ చేసిన నిర్వాకానికి ఆర్థిక విధ్వంసం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని, పత్యం పాటించాల్సిన ఈ సమయంలో సమ్మెలకు వెళ్లడం భావ్యం కాదన్నారు. గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులు కొట్లాడితేనే తెలంగాణ వచ్చిందన్నారు. ప్రతి నెలా ప్రభుత్వానికి వివిధ రూపాల్లో రూ. 22,500 కోట్లు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. అయితే రాష్ట్రానికి వచ్చేది రూ.18,500 కోట్లు మాత్రమేనని, వాటిని ఎలా సర్దాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన అప్పుకు వడ్డీలు కట్టేందుకే రూ.16 వేల కోట్ల అప్పులు తెచ్చామని సీఎం చెప్పారు. ఈ 15 నెలల నుంచి తనతోపాటు, తన సహచర మంత్రులు

మిగతా 2వ పేజీలో..



15శాతం తగ్గిన

## బంగారం ధర

02

# రేవంత్ లక్ష్యం ఏమిటి?

- ప్రతిపక్షనేత హోదాపై చర్చ లేవనెత్తిన సీఎం
- కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించే ప్లానా?
- పదునైన విమర్శల వెనక మర్మం ఇదేనా?



జర్నలిస్ట్ డైరీ, నెల్లూరు (మే 01): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడైన కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్ష నాయకుడిగా అన్ని సౌకర్యాలు, హోదాలు కల్పించినప్పటికీ, ఆయన బాధ్యతలను నిర్వర్తించకుండా ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకోవడం ఎందుకని రేవంత్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం బలంగా, చురుకుగా ఉండాలని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. కేసీఆర్ ప్రజల సమస్యలపై గొంతు వినిపించకపోవడం, సభలో చురుకైన పాత్ర పోషించకపోవడం పట్ల రేవంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ తన వ్యాఖ్యల్లో ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలను గుర్తు చేస్తూ, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు నాయకులు వారి దగ్గరకు వెళ్లి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. "పిల్లల్ని పంపేందుకు మీరెందుకు ప్రతిపక్ష నాయకుడిగా ఉండాలి? పార్టీ అధ్యక్షుడిగా ఉండి ప్రజల కోసం ఎందుకు పనిచేయట్లేదు?" అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ నాయకులు

మిగతా 2వ పేజీలో..

# ఐదేళ్ల పాటు పోరాటం

- మూడు రాజధానులతో జగన్ సర్కార్ మోకాలడ్డు
- అసమాన పోరాటం చేసిన అమరావతి రైతులు
- కూటమి సర్కార్ రాకతో మళ్లీ చిగురించిన ఆశలు

02

# ఇది మోదీ సర్కార్



- ఎవరూ తప్పించుకోలేరు
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

జర్నలిస్ట్ డైరీ, న్యూఢిల్లీ(మే 01):
జమ్ముకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రవాదులు దాడికి పాల్పడి.. 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్థాన్‌కు

మిగతా 2వ పేజీలో..



# దేశానికి రాహుల్ మార్గదర్శి అయ్యారు

- పాదయాత్రలోనే కులగణనపై మాట ఇచ్చారు
- మోడీ మా సూచనలు తీసుకోవచ్చు
- మాకు అనుభవం ఉంది
- హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి

2

# ఇంట్లోకి దూసుకెళ్లిన కారు..



- ఐదుగురు మెడికోల మృతి

02



# రేవంత్ లక్ష్యం ఏమిటి?

**మొదటిపేజీ తరువాయి**

కేవలం అధికారం, ఆదాయం కోసం కాకుండా, ప్రజల సేవ కోసం పనిచేయాలని రేవంత్ పరోక్షంగా సూచించారు. ఈ వ్యాఖ్యలు ప్రతిపక్ష నాయకత్వంలో చోటుచేసుకున్న నిష్క్రియాత్మక వైఖరిని ఎత్తిచూపేలా ఉన్నాయి.రేవంత్ రెడ్డి తన విమర్శల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేశారు. ప్రతిపక్షం కేవలం విమర్శలకు పరిమితం కాకుండా, ప్రభుత్వ విధానాలను పరిశీలించి, ప్రజలకు అనుకూలమైన సూచనలు అందించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఈ బాధ్యత నుంచి తప్పుకోవడం వల్ల ప్రజల సమస్యలు సరిగా చర్చకు రావడం లేదని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ఆయన ప్రతిపక్షం చురుకైన పాత్ర పోషించాలని, అవసరమైతే ప్రభుత్వంతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న డైనమిక్స్‌ను సూచిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం నిష్క్రియంగా మారినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కేసీఆర్ శాసనసభలో చురుకుగా పాల్గొనకపోవడం, ప్రజల మధ్యకు వెళ్లకపోవడం వంటి అంశాలు బీఆర్ఎస్ పార్టీపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రేవంత్ వ్యాఖ్యలు రాజకీయంగా కేసీఆర్‌ను ఒక కూడలిలో నిలబెట్టే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ప్రకటిస్తోంది. ఈ సమయంలో ప్రతిపక్షం నిద్రాణస్థితిలో ఉండటం వల్ల ప్రభుత్వం తన విధానాలను మరింత బలంగా అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కేవలం విమర్శలకు పరిమితం కాకుండా, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం యొక్క బాధ్యతాయుతమైన పాత్రను గుర్తుచేసే విధంగా ఉన్నాయి. కేసీఆర్ ఈ పిలుపును స్వీకరించి, మరింత చురుకైన రాజకీయ పాత్ర పోషిస్తారా లేక ఈ విమర్శలను పట్టించుకోకుండా మౌనంగా ఉంటారా అనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన అంశంగా మారింది.



# 15శాతం తగ్గిన బంగారం ధర

**జర్నలిస్ట్ డైరీ, న్యూఢిల్లీ(మే 01):**
జనవరిమార్చి త్రైమాసికంలో భారత్‌లో బంగారం డిమాండ్ 15శాతం తగ్గి 118.1 టన్నులకు చేరింది. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఈ కాలంలో మొత్తం పెట్టుబడి విలువ 22శాతం పెరిగి రూ.94,030 కోట్లకు చేరుకుంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఈ విషయాన్ని వెల్లడించింది. కౌన్సిల్ తెలిపిన వివరాల ప్రకారం.. 2025లో భారత్‌లో బంగారం డిమాండ్ 700800 టన్నుల మధ్య ఉంటుందని అంచనా. అయితే, ఈ ఏడాది జనవరి నుంచి బంగారం ధరలు 25శాతం పెరిగాయి. ఒక దశలో తులం బంగారం రూ. లక్ష వరకు చేరింది. ధరల పెరుగుదల మార్కెట్‌లో వినియోగదారులను భారీగా ప్రభావితం చేసింది. భారీగా పెరిగిన ధరల కారణంగా కొనుగోలు సామర్థ్యాన్ని ప్రభావితం చేశాయి. అయినప్పటికీ బంగారం ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఇది కొనుగోలు సెంటిమెంట్‌కు సహాయపడుతుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సచిన్ జైన్ త్రైమాసిక నివేదికలో పేర్కొన్నారు.

# ఇది మోదీ సర్కార్

**మొదటిపేజీ తరువాయి**


తగిన గుణపాఠం నేర్పించేందుకు కేంద్రం కసరత్తులు చేస్తోంది. ఉగ్రవాదులను అంతం చేసేందుకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ప్రకటించింది.అయితే తాజాగా ఈ అంశంపై తొలిసారి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఉగ్రవాద పోరాటంలో భారత్‌కు అన్ని దేశాలు అండగా నిలుస్తాయని ఆయన అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు మా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఉగ్రదాడికి పాల్పడినవారికి తగిన శిక్ష విధిస్తామని పేర్కొన్నారు. పిరికి దాడి చేసి.. అదో గొప్ప విజయంగా భావిస్తున్నారని అన్నారు. ఇది మోదీ ప్రభుత్వమని.. ఎవరూ తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటంలో భారతీయులే కాదు.. ప్రపంచమంతా భారత్‌తో నిలుస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# లక్ష్మీ వెంకటేశుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలి

- పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 01) :**
పద్మావతీ సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్ల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. గురువారం హైదర్ నగర్ లోని శ్రీలా పార్క్ ప్రైడ్ లో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మదలర్మేల్ మంగా, పద్మావతీ సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్ల త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతి కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండల్ రావు, దామోదర్ రావు, వడ్డేపల్లి రాజు, ఆదిత్య, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఐదేళ్ల పాటు పోరాటం



**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ (మే 01):**
అమరావతి రాజధాని నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. మే 2న ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడ నుంచి పనులు వేగవంతం కానున్నాయి. గత అనుభవాల దృష్ట్యా అమరావతి విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు సీఎం చంద్రబాబు. అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరనున్నారు. ఈ మేరకు ఏపీ అసెంబ్లీలో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి నివేదించనున్నారు. పార్లమెంట్లో ప్రత్యేక చట్టం చేసి అమరావతిని శాశ్వతం చేయాలని చూస్తున్నారు చంద్రబాబు. ఇదే విషయాన్ని చంద్రబాబు అమరావతి రైతులకు స్పష్టం చేశారు. ఎటువంటి అపోహలు వద్దని.. మీ భవిష్యత్తుకు నేను అండగా ఉంటాను అని.. అందుకు తగ్గట్టు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటానని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. రాజధాని రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు.2014లో టిడిపి అధికారంలోకి వచ్చింది. అప్పట్లో అందరి ఆమోదంతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు నాటి సీఎం చంద్రబాబు. దాదాపు 33 వేల ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా అమరావతి రాజధానికి ఇచ్చారు. 2017 లో ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి పనులు ప్రారంభించింది టిడిపి సర్కార్. కానీ అప్పట్లో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నిధుల సమీకరణ, నిర్మాణాల విషయంలో ఇప్పటిలా సహకారం కేంద్రం నుంచి లభించలేదు. అదే సమయంలో రాజకీయంగా కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండేది. ప్రత్యేక హోదా అంశాన్ని తెరపైకి తెచ్చి చంద్రబాబును డిఫెన్స్ లో పెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అలా 2018లో కేంద్రాన్ని విభేదించి ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు చంద్రబాబు. 2019 ఎన్నికల్లో మూల్యం చెల్లించుకున్నారు. బీజేపీని విభేదించి ఓడిపోయారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధాని పూర్తిగా నిర్వీర్యం అయింది. జగన్ సర్కార్ మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అప్పటినుంచి అమరావతి రైతులు పోరాట బాట పట్టారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. అమరావతి టు తిరుపతి, అమరావతి టు అరసవెల్లి పేరిట అమరావతి రైతులు యాత్ర చేపట్టారు. ఒకవైపు న్యాయపోరాటం చేస్తూనే మరోవైపు దేవుడి ప్రాపకం కోసం కూడా పరితపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే అమరావతి పై రైతులు ఆశలు వదులుకున్నారు. అటు అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. కానీ జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు తెరపైకి తెచ్చి అమరావతిని నిర్వీర్యం చేశారు. కానీ పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం సైలెంట్ గా ఉండిపోయింది. రాజకీయ కారణాలతో కనీసం స్పందించలేదు. దీంతో అమరావతి రైతులు ఆశలు వదులుకున్నారు.అయితే కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అందుకు తగ్గట్టుగానే కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణం పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. కేంద్రం సైతం గతం కంటే భిన్నంగా సాయం విషయంలో ఉదారంగా వ్యవహరిస్తోంది. కేంద్రంలో టిడిపి కీలక భాగస్వామి కావడంతో అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించాలని టిడిపి ఒత్తిడి చేస్తోంది. ఈ మేరకు ఏపీ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి కేంద్రానికి నివేదించనున్నారు. పార్లమెంట్లో ప్రత్యేక చట్టం చేసి అమరావతిని పదిలం చేయాలని చంద్రబాబు మాస్టర్ ప్లాన్ వేశారు. అదే విషయాన్ని అమరావతి రైతులకు చెప్పడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఇంకోవైపు అదనపు భూముల సేకరణకు సంబంధించి కూడా ఎటువంటి అపోహలు వద్దని.. అన్ని తాను చూసుకుంటానని చంద్రబాబు చెప్పడం విశేషం.

# దేశానికి రాహుల్ మార్గదర్శి అయ్యారు



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(మే 01):**
తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తి చేసి చూపించామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రధాని మోదీ సైతం..తెలంగాణ మోడల్ తీసుకొని..దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఆయన సూచించారు. రిజర్వేషన్లను 50 శాతం కంటే పెంచి.. అందులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి అని కోరారు. "మొన్నటి వరకు బీజేపీ కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడింది. మా ఒత్తిడి తోనే కేంద్రం కులగణనకు ముందుకు వచ్చింది. బీజేపీ తమ సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలంటే కులగణన చేసి తీరాల్సిన పరిస్థితి ఉంది. ఎన్డీయే లోని పార్టీలు కులగణన కోరుతున్నాయి అని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన ఏమన్నారంటే.. "రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారు. ఆ సమయంలో.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే.. కులగణన చేయిస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇది చేయించడం ద్వారా దేశానికి ఒక మార్గదర్శనం ఇచ్చారు రాహుల్ గాంధీ" అని రేవంత్ రెడ్డి అన్నారు. "కులగణనపై మాకు అనుభవం ఉంది. మా సూచనలు తీసుకోవచ్చు. ముందుగా మంత్రుల బృందాన్ని నియమించి, ఆ తర్వాత నిపుణుల కమిటీ వేసి, అన్ని రాష్ట్రాలపై అధ్యయనం చెయ్యాలి. తెలంగాణలో బోయ కులం వారు ఓబీసీగా ఉన్నారు, కర్ణాటకలో వారు వేరే కేటగిరీలో ఉన్నారు. ఇలా వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నారు. అందువల్ల జాతీయ కులగణన చేపట్టే ముందు.. మంత్రుల బృందం, నిపుణుల కమిటీ వేసి, ఏయే రాష్ట్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవాలి. మమ్మల్ని ఆ మంత్రులు, కమిటీ సభ్యులు కలిసి, చర్చించాలి. పౌరులతో మాట్లాడాలి. ప్రతీ జిల్లాకీ వెళ్లి.. నిపుణులు, మంత్రులూ.. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలి. మేము 57 ప్రశ్నలు వేసి, కులగణన చేపట్టాం. 8 పేజీల్లో వివరాలు ఇచ్చాం. అలాగే.. కేంద్రం కూడా చెయ్యాలి. మేము ప్రజల సూచనలతోనే.. కులగణన ప్రశ్నలు తయారుచేశాం. కేంద్రం కూడా అలాగే చేస్తే బాగుంటుంది" అని సీఎం రేవంత్ అన్నారు.



## ప్రధాని పర్యటనపై కోటి ఆశలు

**మొదటిపేజీ తరువాయి**
మరోసారి అటువంటి పరిస్థితి ఉండదని.. అమరావతి రాజధాని పునర్నిర్మాణ సమయంలో కేంద్రం ప్రత్యేక నిధులు ప్రకటిస్తుందని ఎక్కువమంది ఆశాభావంతో ఉన్నారు.మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణ శంకుస్థాపనకు సమయం ఆసన్నమవుతోంది. ప్రధాని పర్యటన కోసం ఏపీ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. స్వాగత ఏర్పాట్ల నుంచి బహిరంగ సభ కోసం ప్రత్యేకంగా నిర్ణయాలు తీసుకుంటుంది. లక్షలాదిమందితో సభ ఏర్పాటుకు కసరత్తు కొనసాగుతోంది. ఇదే సమయంలో ప్రధాని అమరావతి కేంద్రంగా చేసే ప్రసంగంపై ఆసక్తి నెలకొంది. తప్పకుండా వరాలు ప్రకటిస్తారన్న నమ్మకం ఏపీ ప్రజల్లో ఉంది. అయితే అమరావతికి ప్రధాని నరేంద్ర మోడీ రావడం ఇది రెండోసారి. అయితే రెండోసారి శంకుస్థాపనకు ప్రధాని రావడం ఏపీ బీజేపీ( నేతల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే సీఎం చంద్రబాబు ప్రత్యేక విన్నపం మేరకు మోడీ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. అయితే ప్రధాని వస్తున్నందున పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేసేలా కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. ఏపీకి అమరావతి రాజధానిగా ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా మారడంతో.. ఇతోధికంగా సాయం చేయాలని ప్రధాని మోడీకి ఎప్పటికీ చంద్రబాబు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రధాని మోదీ సైతం అమరావతి కోసం భారీ వరం ప్రకటించే అవకాశం ఉందనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో సాగుతోంది. అయితే మోడీ గతం మాదిరిగా చేతులెత్తేస్తారా? లేకుంటే సాయం ప్రకటిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఇంట్లోకి దూసుకెళ్లిన కారు..



**జర్నలిస్ట్ డైరీ, నెల్లూరు (మే 01):**
నిశ్చితార్థ వేడుకకు హాజరై.. ఆనందంగా గడిపిన ఆ వైద్య విద్యార్థుల తిరుగు ప్రయాణం తీవ్ర విషాదంగా మారింది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి.. రోడ్డుపై పల్టీలు కొడుతూ.. పక్కనే ఉన్న ఓ ఇంటిలోకి దూసుకెళ్లింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం పోతిరెడ్డిపాలెం సమీపంలో జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు నారాయణ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి సోదరి వివాహ నిశ్చితార్థం బుధవారం బుచ్చిరెడ్డిపాలెంలో జరిగింది. ఆ వేడుకకు సుమారు 25 మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో కొందరు మూడు కార్లలో వెళ్లగా.. మిగిలిన వారు బస్సులు, ఆటోల్లో చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఒక కారు ముందు వెళ్లగా.. రెండో కారు పోతిరెడ్డిపాలెం వద్ద పెట్రోల్ బంకు సమీపంలో అదుపుతప్పి.. రోడ్డుపై పల్టీలు కొడుతూ.. పక్కనే ఉన్న ఇంటిలోకి దూసుకెళ్లింది. ఆ ఇల్లు పూర్తిగా ధ్వంసమవగా.. అందులో నివసిస్తున్న ఎన్. వెంకటరమణయ్య(56) మృతి చెందారు. కారులో ఆరుగురు వైద్య విద్యార్థులు ఉండగా, ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో నలుగురిని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు విడిచారు. మృతుల్లో అనంతపురానికి చెందిన కె.అభిషేక్‌రాజ్ (22), నెల్లూరు జిల్లా సంగం మండలం సిద్ధిపురానికి చెందిన గుండ్ల జీవన్‌చంద్రారెడ్డి (22), ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన గుర్రం యజ్ఞేష్ (21), అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన ఎల్.నరేష్‌నాయక్ (22), తిరుపతి ప్రశాంతినగర్‌కు చెందిన గోను అభిసాయి పురుషోత్తం (21) ఉన్నారు. నవనీత్ శంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న తోటి వైద్య విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు. తీవ్ర గాయాలతో జీవన్, యజ్ఞేష్‌లను నారాయణ ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిసి వెళ్లారు. అప్పటికే వారు మృతి చెందారని, నెల్లూరు సర్వజన ఆసుపత్రికి తరలించారని తెలుసుకుని అక్కడికి చేరుకున్నారు. అప్పటివరకు తమతో సరదాగా గడిపిన స్నేహితులు విగతజీవులుగా పడి ఉండడం చూసి బోరున విలపించారు. స్నేహితులను కడసారి చూసుకునేందుకు వైద్య విద్యార్థులు పెద్దఎత్తున జీజీహెచ్ శవాగారం వద్దకు వచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించే వరకు వారంతా అక్కడే ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు మాజీ సీఎం జగన్ సానుభూతి తెలిపారు.



# పత్యం పాటించాలి!

**మొదటిపేజీ తరువాయి**

నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని అన్నారు. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం చెప్పారు. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దని, వాళ విషపు చూపుల్లో చిక్కుకోవద్దని అన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని, ఇది మీ సంస్థ అని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే మంత్రితో చర్చించాలన్నారు. వచ్చే ఆదాయమంతా చేతిలో పెడతామని.. ఎలా ఖర్చు చేద్దామో సూచన చేయాలన్నారు. అణా పైసా కూడా తాను ఇంటికి తీసుకెళ్లేది లేదన్నారు. కార్మికుల కోసమే ఖర్చు చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఒకసారి ఆలోచించాలన్నారు.

పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఖజానా అంతా లూటీ చేసినా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ తరుణంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పోతే ప్రజలు ఇబ్బంది పడతారని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో కొంత వెసులుబాటు అవసరమని అన్నారు. ఖజానాలో కాసుల్లేకున్నా ఒక్క పథకం కూడా ఆపలేదని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా అన్ని పథకాలు అమలు చేస్తున్నా.. శాపనార్థాలు పెడుతున్నారని అన్నారు. పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగిపడవని, మంత్రాలకు చింతకాయలు రాలవనే విషయం కేసీఆర్ గ్రహించాలని సీఎం అన్నారు. కపట నాటక సూత్రధారి మళ్లీ బయల్దేరిండని, జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి పంపిన పిల్లలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని అన్నారు. ఆయన గతంలో చెప్పినట్టు దళితుడిని ముఖ్యమంత్రిని చేయలేదని, కనీసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగానైనా అవకాశం ఇవ్వాలని సీఎం అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన కేసీఆర్ కడుపునిండా విషం పెట్టుకొని మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ విమర్శించారు. పదేండ్లలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని అన్నారు. ఆర్థిక ఉగ్రవాదం కారణంగా పేదవాడు మరింత నిరుపేదగా మారాడని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబానికి పేపర్లు, టీవీలు, ఫాంహౌస్‌లు వచ్చాయని అన్నారు. ఇప్పుడు దిగిపోగానే... వచ్చి తనకు ఇవ్వండి తాను సక్క దిద్దుతా..? అని మాట్లాడుతున్నారని అన్నారు. గత పదేండ్లలో ఎవరైనా కష్టమున్నోళ్లు బయటికొచ్చి చెప్పుకునే అవకాశమే ఇవ్వలేదని అన్నారు.

**గల్ఫ్ కుటుంబాలకు అండగా ఉంటాం!**
గల్ఫ్ లో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. వారి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా చెల్లిస్తోందని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం చెప్పారు. అలాగే త్వరలోనే గిగ్ వర్కర్ల పాలసీని తీసుకురాబోతున్నామని చెప్పారు. ఈ పాలసీ దేశానికే రోల్ మోడల్ గా నిలువబోందని అన్నారు. వాళ్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేయబోతున్నామని అన్నారు.

# కొత్త డీజీపీ ఎవరు?

- **రేసులో ఆరుగురు.. తెరపైకి సౌమ్య మిశ్రా**

**జర్నలిస్ట్ డైరీ, తెలంగాణ (మే 01):**

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు తదుపరి బాస్ ఎవరు? అనే చర్చ మొదలైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీతో డీజీపీ డా.జితేందర్ పదవీకాలం ముగుస్తుండటంతో ఆయన తర్వాత ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.దీని కోసం ప్రభు త్వం తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 7 మంది ఐపీఎస్ అధికారులతో ప్యానెల్ లిస్ట్‌ను సిద్ధం చేసినట్టు సమాచారం. జాబితాను యూపీఎస్సీకి సిఫారసు చేసిందని తెలుస్తోంది. ఈ లిస్ట్ నుంచి యూపీఎస్సీ ముగ్గురు అధికారుల పేర్లను సిఫారసు చేస్తుంది.వారిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించే అవకాశం ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు



చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారుల్లో తెలంగాణకు తర్వాత డీజీపీ ఎవరు కాబోతున్నారనే అంశంపై స్పష్టత వస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ప్యానెల్ లిస్టులో 1990 బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా, 1991బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి, బీ శివధర్‌రెడ్డి, డా. సౌమ్యమిశ్రా, శిఖా గోయల్ ఉన్నట్టు తెలుస్తోంది. కొత్త డీజీపీ నియామకంలో సీనియా రిటీకి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.అయితే రవి గుప్తా, సీవీ ఆనంద్, బీ శివధర్‌రెడ్డి, సౌమ్యమిశ్రా పేర్లు ప్రముఖంగా వినిపిస్తు న్నాయి. రవి గుప్తా ప్రస్తుతం హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నారు. ఆయన గతంలో 2023 డిసెంబర్ నుంచి 2024 జూలై వరకు డీజీపీగా కూడా పనిచేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్‌రెడ్డి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారు. సీవీ ఆనంద్ ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. సీవీ ఆనంద్ 2028 జూన్‌లో రిటైర్ కానున్నారు. సౌమ్య మిశ్రా, శిఖా గోయల్‌తో పాటు ఏడీజీలు మహేశ్ మురళీధర్ భగవత్, సజ్జనార్, స్టీఫెన్ రవీంద్ర పేర్లు కూడా వినిపిస్తున్నాయి. తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభు త్వం డీజీ కేడర్‌లోని సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపా ల్సి ఉంటుంది. యూపీఎస్సీ ముగ్గు రు అధికారుల ప్యానెల్‌ను సిఫారసు చేస్తుం ది. వారిలో ఒకరిని డీజీపీగా నియమించాలి. డీజీపీగా నియమితులయ్యే అధికారికి కనీ సం 30 ఏళ్ల సర్వీసు ఉండాలి. డీజీ లేదా ఏడీజీ ర్యాంక్ కలిగి ఉండాలి. కనీసం ఆరు నెలల సర్వీసు మిగిలి ఉండాలి.నియామకంపై సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ సూ ర్యకాంత్, జస్టిస్ దీపాంకర్‌దత్తా, జస్టిస్ ఉజ్జల్‌భుయాన్‌తో కూడిన బెంచ్ కీలక తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలంగాణకు డీజీపీగా ఉన్న జితేందర్ పదవీ కాలం సెప్టెంబర్ 6న ముగుస్తుంది.అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీ నియామకానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచా రం. రవిగుప్తా, బీ శివధర్‌రెడ్డిలతో పోలిస్తే సీవీ ఆనంద్, ఆప్టే వినాయక్ ప్రభాకర్, సౌమ్య మిశ్రా, శిఖా గోయల్‌లకు ఎక్కు వ పదవీ కాలం ఉండటంతో రాష్ట్ర ప్రభు త్వం ఎవరిని తెలంగాణ కు కొత్త డీజీపీగా నియమిస్తుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక దారుఢ్యం..!

- **బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభంలో పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 01) :**

క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం సాధ్యమవుతుందని పీఏసీ ఛైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ ఎన్ఐఎస్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దనాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కార్యక్రమంను పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ ఎన్ఐఎస్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దనాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ క్రీడల్లో పాల్గొనడం చాలా అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతా ఇస్తుందని, క్రీడాకారులకు తగిన సదుపాయాలు ఉన్నాయని, అన్ని క్రీడలకు, క్రీడాకారులకు ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గచ్చిబౌలి, పీజేఆర్ లాంటి స్టేడియాలు అందుబాటులో ఉన్నాయని, రానున్న కాలంలో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సర్వ సాధరణమని, ఓటమి గెలుపుకు నాంది అన్నది మర్చిపోవద్దని, గెలిచేందుకు ప్రయత్నించాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడాకారులలో దాగిన సృజనాత్మకతను బయటకు వెలుగు దీయడానికి క్రీడలు ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. పిల్లలు చదువులతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే మంచి భావి పౌరులుగా దేశానికి సేవలు అందిస్తారని, తల్లిదండ్రులకు, దేశానికి మంచి సేవలు



అందించాలని అన్నారు. విద్య, క్రీడల అభివృద్ధికి గాను ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. అదే విధంగా నా దృష్టికి వచ్చిన మీ ప్రతి సమస్య పరిష్కారానికి నా వంతు శాయశక్తులా కృషి చేస్తానని, మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పారిష్కారం అయ్యేలే తన వంతు కృషి చేస్తానని, నా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని వివరించారు. నాయకులు రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## సివిల్ సర్వీసెస్ పరీక్ష కోసం మైనార్టీలకు ఉచిత శిక్షణ

- **జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి**

**జర్నలిస్ట్‌డైరీ, మంచిర్యాల బ్యూరో (మే 01) :**

యూపీఎస్సీ సీఎస్‌ఏటీ 2026 (సివిల్ సర్వీసెస్) పరీక్ష కోసం 2025 26 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 100 మంది మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీలు) అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్‌డ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని ప్రొఫెషనల్/ సాధారణ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఆన్లైన్ లో https://cet.cgg.gov.in, www.tmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 5వ తేదీన జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# టెస్లాకు కొత్త సీఈవో..!

- **స్పందించిన ఎలాన్ మస్క్...**

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**

ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా మారిన ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ ను టెస్లా సీఈఓ బాధ్యతల నుంచి తప్పించాలని కంపెనీ బోర్డు భావిస్తోంది. కొత్త వ్యక్తి నియామకం కోసం ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో దిగ్గజ వ్యాపారవేత్తగా ఎదిగిన ఎలాన్ మస్క్ ట్రంప్ ప్రభుత్వంలో సంస్కరణల కోసం ఏర్పాటుచేసిన 'డోజ్' సారథిగా పని చేస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం శ్రమించిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు కీలక పదవి దక్కింది. అయితే ట్రంప్ పరిపాలనలో మస్క్ అధిక ప్రమేయం ఉందనే వాదనలతో పెద్దఎత్తున విమర్శలు ఎదుర్కొన్నారు.



ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నారని, ఇందులో మస్క్ కీలక పాత్ర పోషించారని విమర్శలు వచ్చాయి. రాజకీయాల్లో అధిక జోక్యంతో ఈ కుబేరుడు తన వ్యాపారాలను పట్టించుకోవడం లేదని పెట్టుబడిదారులపై ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఫలితంగా టెస్లా విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఈనేపథ్యంలో మస్క్‌ను తప్పించి వేరొకరికి ఆ బాధ్యతలు అప్పగించాలని బోర్డు సభ్యులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. టెస్లా ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాల్లో పెద్దఎత్తున నష్టాల్ని మూటగట్టుకుంది. లాభంలో 71 శాతం క్షీణత నమోదు చేసుకుంది. టెస్లా ఆదాయవ్యవహారాలపై నిర్వహించిన సమావేశంలో కీలక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. ట్రంప్ పరిపాలనకు తాను కేటాయించే సమయాన్ని గణనీయంగా తగ్గించుకుంటానని, తన కంపెనీలు నడిపేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తానని మస్క్ తెలిపినట్లు సమాచారం. టెస్లా సంస్థకు వేరొక సీఈఓను నియమించాలని బోర్డు భావిస్తోందని, అందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనాన్ని ఎలాన్ మస్క్ 'ఎక్స్' వేదికగా ఖండించారు. ఆ వార్తలను కొట్టిపారేశారు. తప్పుడు కథనాలు ప్రచురిస్తూ.. పత్రిక విలువల ఉల్లంఘనలకు పాల్పడుతోందని సోషల్‌మీడియా వేదికగా మండిపడ్డారు.

## జూన్ 16 నుంచి యూపీఐ లావాదేవీలు ఇక మరింత వేగంగా

- **ఎన్‌పీసీఐ తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది.**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం (మే 01):**

యూపీఐ లావాదేవీలు మరింత వేగంగా పూర్తి కానున్నాయి. ఈ మేరకు ఎన్‌పీసీఐ తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది. మనం ఎవరికైనా యూపీఐ పేమెంట్ చేశామనుకుందాం. ఆ లావాదేవీ విజయవంతంగా పూర్తవ్వడానికి కొంత సమయం పడుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక 'సక్సెస్' అని సందేశం వస్తేనే దాన్ని వ్యాపారికి/ దుకాణదారుడికి చూపించాకే వెళుతుంటాం. కొన్నిసార్లు ఎక్కువ సమయమే వేచి చూడాల్సి వస్తుంటుంది. ఇకపై ఆ సమయం దాదాపు 50 శాతం మేర తగ్గనుంది. జూన్ 16 నుంచి సవరించిన సమయం అమల్లోకి రానుంది. ఈ మేరకు వివిధ రకాల యూపీఐ లావాదేవీల గడువును సవరిస్తూ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (NPCI) తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఒక లావాదేవీ పూర్తి కావడానికి పట్టే పూర్తి సమయాన్ని రెస్పాన్స్ టైమ్‌గా వ్యవహరిస్తారు. అంటే మనం ఏదైనా లావాదేవీ నిర్వహిస్తే దాని తుది సందేశం వచ్చేంత వరకు దాన్ని లావాదేవీ సమయంగానే వ్యవహరించాలి. ఎన్‌పీసీఐ తాజా




ఆదేశాల ప్రకారం క్రెడిట్ / డెబిట్‌కు సంబంధించిన లావాదేవీల సమయం కేవలం 15 సెకన్లలోనే పూర్తి కానుంది. ప్రస్తుతం ఇది 30 సెకన్లుగా ఉంది. ఇదొక్కటే కాదు.. ట్రాన్సాక్షన్ స్టేటస్, ట్రాన్సాక్షన్ రివర్సల్, అడ్రస్ వ్యాలిడేషన్ సమయం కూడా 30 సెకన్ల నుంచి 10 సెకన్లకు తగ్గనుంది. యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను మెరుగుపరిచేందుకే ఈ మార్పులు చేపట్టినట్లు ఎన్‌పీసీఐ తన సర్క్యులర్‌లో పేర్కొంది. జూన్ 16 నుంచి రెస్పాన్స్ సమయం తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని పేటీఎం, ఫోన్ పే వంటి పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, బ్యాంకులకు ఎన్‌పీసీఐ సూచించింది. ఉదాహరణకు.. ఎస్‌బీఐకి చెందిన ఓ వ్యక్తి ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతా కలిగిన దుకాణదారుడికి చెందిన ఖాతాకు యోనో యాప్ నుంచి పేమెంట్ చేశారనుకుందాం. ఆ లావాదేవీ పూర్తయ్యిందా లేదా అనేది ఐసీఐసీఐ బ్యాంక్ ధ్రువీకరించాలి. దాన్ని ఎన్‌పీసీఐ నెట్‌వర్క్ ద్వారా ఎస్‌బీఐ వినియోగదారుడికి చూపించాలి. ఇందుకోసం గతంలో 30 సెకన్లు పట్టేది. జూన్ 16 నుంచి 15 సెకన్లకు తగ్గనుంది. కేవలం చెల్లింపులకు సంబంధించిన లావాదేవీలే కాకుండా.. ఇతర యూపీఐ లావాదేవీల గడువు కూడా గణనీయంగా తగ్గనుందని నిపుణులు చెబుతున్నారు.

## కృత్రిమ మేధ టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది

- **సాంకేతికతపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**

కృత్రిమ మేధ టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. సర్వం ఏఐమయమౌవుతుందన్న వాదనల నేపథ్యంలో ఈ సాంకేతికతపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మరో 18 నెలల్లో తమ కంపెనీకి చెందిన కోడింగ్ కృత్రిమ మేధనే చేస్తుందన్నారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జుకర్‌బర్గ్ మెటాలో కృత్రిమ మేధ పాత్ర గురించి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పటికే ఓ బృందంలో సభ్యుడిగా విధులు నిర్వహిస్తోందన్నారు. త్వరలోనే టాప్ కోడర్ల కంటే ఏఐ మెరుగ్గా పని చేస్తుందంటూ వ్యాఖ్యానించారు. మీరు ఏదైనా లక్ష్యాన్ని ఇస్తే.. ఏఐ ఆ పనిని సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. బగ్‌లను కనుగొంటూ, అధిక నాణ్యత కోడ్‌ను స్వతంత్రంగా రాయగలదని జుకర్‌బర్గ్ భావించారు. రానున్న 1218 నెలల్లో తమ కంపెనీకి చెందిన లామా ప్రాజెక్ట్‌కు సంబంధించి చాలావరకు కోడింగ్‌ను ఏఐయే పూర్తిచేస్తుందని జుకర్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. పసిడికి 'అక్షయ తృతీయ' కళ ప్రముఖ టెక్ దిగ్గజాలు ఏఐపై ఇదే అభిప్రాయాల్ని వ్యక్తంచేస్తూ వచ్చారు. తాజాగా మెటా లామా ఏఐ డెవలపర్ కార్యక్రమంలో పాల్గొన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తమ కంపెనీకి సంబంధించి 20 నుంచి 30 శాతం కోడ్‌ను కృత్రిమ మేధతోనే సృష్టిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత కోసం ఏఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ ఇప్పటికే వెల్లడించారు. జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు.



## కాంగ్రెస్ అంటే రేవంత్ ఒక్కడేనని భ్రమపడుతుండు!

- **మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**జర్నలిస్ట్ డైరీ, నల్లగొండ(మే 01):**

సీఎం రేవంత్ రెడ్డి పై మాజీమంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పేరు కేసీఆర్ ఎత్తినా.. ఏత్తకపోయినా రేవంత్ కి భయమైతుందని అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే రేవంత్ పేరు మరచిపోతున్నారు. ఒక్క మంచి పని చేయని రేవంత్ పేరు ప్రజలెందుకు గుర్తుపెట్టుకుంటారు. రేవంత్ వల్ల బాధించబడ్డవారే ఆయనను ఓడించేందుకు గుర్తు పెట్టుకుంటారు. కాంగ్రెస్ అంటే రేవంత్ ఒక్కడేనని భ్రమపడుతుండు. ముమ్మాటికీ తెలంగాణకి కాంగ్రెసే విలన్.పదవి రాగానే సోనియాని బలి దేవతన్న మాటలు మరచిపోయారా. అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిది. కేసీఆర్ పై చిల్లర మాటలు మాని హామీల అమలు సంగతి



చూడండి.పదేళ్ళు మాదే అధికారమన్న వాళ్లకి కేసీఆర్ ఫార్మ్ హౌస్ లో ఉంటే భయమెందుకు.ఎన్ని రోజులు పదవిలో ఉంటాడో రేవంత్ కే తెలవదు. అలవికాని హామీలిచ్చి అమలు చేయలేకే విమర్శలని అన్నారు.



## హక్కులకై ఐక్యంగా పోరాడితేనే విజయం..!

- **కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 01) :**

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడినప్పుడే విజయాలు సాధిస్తామని హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడు పోరాటాలకు సిద్ధంగానే ఉండాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ అన్నారు. మేడే సందర్భంగా పట్టణంలో సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నడికుడ ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో సెంట్రింగ్ అసోసియేషన్ కార్యాలయంలో మేడే జెండాను రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఆరు ప్రాథమిక హక్కులు ఉన్నాయనీ అవి సమానత్వ హక్కు, స్వేచ్ఛ హక్కు, దోపిడీకి వ్యతిరేకంగా హక్కు, మత స్వేచ్ఛ, సాంస్కృతిక, విద్యా హక్కులు, రాజ్యాంగ పరిష్కారాల హక్కులు ఉన్నాయని కార్మికులకు వివరించారు. పనిముట్లు పట్టుకొని శ్రమను చిందించిన ప్రతి వ్యక్తి కార్మికుడేనని అన్నారు. హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం సంఘటితమై పోరాటం చేసినప్పుడే విజయాలు వరిస్తాయని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎంతో మంది త్యాగధనుల పోరాట ఫలితమే ఈరోజు మేడే కార్యక్రమం కార్మికులు జరుపుకుంటున్నారని అన్నారు. అసంఘటిత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటి కొరకు అందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రంగంపల్లి ఆంజనేయులు, అధ్యక్షులు నడికుడ ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షులు సబావత్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి పాత్లావత్ రమేష్ నాయక్, కోశాధికారి టేకులపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



## అసంఘటిత రంగంలో కార్మికవర్గం సంఘటితంగా ఉండాలి

- **భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కుమ్మరి యాదయ్య**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 01) :**

ఐక్యమత్యంతో సంఘటితమై అన్ని వర్గాల అభివృద్ధి కోసం పాటుపడాల్సిన అవసరం ఉందని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కుమ్మరి యాదయ్య అన్నారు. మేడే సందర్భంగా షాద్ నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం వద్ద అధ్యక్షుడు కుమ్మరి యాదయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో తమ హక్కుల సాధనకై ఉద్యమిస్తున్న ఎందరో పోరాట యోధులు మనకు ఆదర్శమన్నారు. నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు వేలాది మంది అనేక రకాల పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, వారి సంక్షేమం కోసం మనం నిరంతరం పాటుపడాలని, అందరం సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చాని అన్నారు. అందరూ ప్రభుత్వ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘంలో గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కుమ్మరి యాదయ్య, ఉపాధ్యక్షులు ఆగమయ్య, ప్రధాన కార్యదర్శి సి హెచ్ రామమూర్తి, సహాయ కార్యదర్శి ఎస్ వెంకట్రావు, కోశాధికారి దర్శి శివ కుమార్, సభ్యులు చటాన్పల్లి రమేష్, దంగు మల్లేష్, మేడిగ యాదయ్య, గంద్రాతి శివయ్య తదితరులు పాల్గొన్నారు.




## మేడేను పురస్కరించుకొని ప్రశంసాపత్రం అందుకున్న శరణ్ జిత్ సింగ్

**జర్నలిస్ట్ డైరీ, సరూర్ నగర్ (మే 01) :**

ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా గాంధీభవన్లో గురువారం టీపీసీసీ లేబర్ ఛైర్మన్, జీహెచ్ఎంసీ ఐఎన్టీయూసీ ప్రెసిడెంట్ ప్రతిభావంతులైన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ కార్యాలయంలో బర్త్ అండ్ డెత్ విభాగంలో పనిచేస్తున్న శరణ్ జిత్ సింగ్ టీపీసీసీ లేబర్ ఛైర్మన్ ప్రకాష్ గౌడ్, జీహెచ్ఎంసీ ఐఎన్టీయూసీ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

# అమరావతికి నిధులు ఎలా?




ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను రూ. 77,249.15 వేల కోట్లు అంచనాతో చేపట్టినట్లుగా ప్రభుత్వం చెబుతోంది.ఒకవైపు లోటు బడ్జెట్.. మరోవైపు అప్పుల భారం ఉన్నప్పటికీ రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేస్తామంటోంది.మరి ఇన్ని వేల కోట్ల రూపాయల నిధులు ఏపీ ప్రభుత్వం ఎక్కడి నుంచి తెస్తుంది?అమరావతి నిర్మాణ పనులకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి?నిధులు ఎలా తెస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది?ఇప్పుడు చేపట్టనున్న అమరావతి పునర్నిర్మాణ పనులలో భాగంగా మొత్తం 100 పనులను రూ.77,249 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నట్లుగా రాష్ట్ర మంత్రి నారాయణ చెప్పారు.''వరల్డ్ బ్యాంకు, ఏడీబీ చెరో రూ. 6,700 కోట్లు చొప్పున రూ.13,400 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించాయి. కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రూ. 5వేల కోట్లు ఇస్తోంది'' అని వివరించారు.వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి వచ్చిన మొత్తంతో పాటు కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కలుపుకొని ఈ ఏడాది ఏప్రిల్ 1న రూ.4,285 కోట్లు ఏపీకి అందాయని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.ఇవి కాకుండా హడ్కో నుంచి రూ.11వేల కోట్లు రుణంగా తీసుకోనుంది ఏపీ ప్రభుత్వం. ఇందుకు సంబంధించి సమ్మతి లేఖ (లెటర్ ఆఫ్ కన్సెంట్)ను తమ ప్రభుత్వం అందించిందని చెప్పారు నారాయణ.'బ్యాంకులు, ఫండింగ్ ఏజెన్సీల నుంచి తీసుకోగా.. మిగిలిన నిధులను భూములు మార్ట్‌గేజ్ చేయడం, విక్రయాలు, లీజుకు ఇవ్వడం ద్వారా సేకరించబోతున్నాం'' అని నారాయణ చెప్పారు.

### రుణభారం ప్రజలపై పడే అవకాశం

వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి వస్తున్న రుణ భారం పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఏపీ ప్రజలపై పడే వీలుందని విజయవాడకు చెందిన ఆర్థిక శాస్త్ర నిపుణుడు ఒకరు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తన బ్యాలెన్స్ షీట్‌లోకి ఈ రుణాలను తీసుకుంటేనే ఏపీ భారం తగ్గుతుందని వివరించారు. అలాగే, 'మల్టీలేటరల్ లోన్ అసిస్టెన్స్' పేరుతో అమరావతి నిర్మాణానికి అప్పులు ఇస్తున్నామని చెబుతోంది కేంద్ర ప్రభుత్వం. వివిధ సంస్థలు లేదా బ్యాంకుల నుంచి ఈ రుణాలు ఏపీకి అందనున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అవసరాన్ని గుర్తించి, మల్టీలేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందేందుకు ఏర్పాట్లు చేస్తాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్లు సమకూరుస్తాం. వచ్చే సంవత్సరాల్లోనూ అదనపు నిధులు సమకూరుస్తాం' అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు.ఈ రూ.15 వేల కోట్లు గ్రాంటా, లేక రుణమా అనేది ఆ ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. కానీ, ఆ రూ.15 వేల కోట్లతో పాటు చాలా వరకూ రుణాలు, రాష్ట్ర ప్రభుత్వానికి అందేలా కేంద్రం ఫెసిలిటేట్ చేస్తుందని, వాటితో పాటుగా కొంత గ్రాంటు కూడా ఉంటుందని తర్వాతి పరిణామాల్లో పలు ప్రకటనల ద్వారా స్థూలంగా తేలింది.ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ 94(3) ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి అవసరమైన సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించాలనే నిబంధన ఉంది.ప్రకారం, ఇప్పటివరకు ''స్పెషల్ అసిస్టెన్స్ (గ్రాంట్లు)'' రూపంలో ఏపీ రాజధాని ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి రూ.2,500 కోట్లు ఇచ్చినట్లు కేంద్రం చెబుతోంది. ఈ ఏడాది మార్చిలో లోక్ సభలో తిరుపతి ఎంపీ గురుమూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి దీనిపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అమరావతి కోసం చేసే అప్పులు ఏపీ తీసుకునే రెగ్యులర్ రుణ పరిమితి (సీలింగ్) కిందకు రావని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, వరల్డ్ బ్యాంకు రుణానికి ఈ ఏడాది జనవరి 22 నుంచి, ఏడీబీ ఇచ్చే అప్పులకు ఫిబ్రవరి 10 నుంచి లోన్ టర్మ్ మొదలైందని కేంద్రం చెప్పింది.తాజాగా ప్రాజెక్టు ఖర్చులో పది శాతం మించకుండా (గరిష్ఠంగా రూ.1500 కోట్లు) 'స్పెషల్ అసిస్టెన్స్' కింద ఇవ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం గ్రాంటు కింద రూ.1,560 కోట్లు ఇస్తోందని ఏపీ మంత్రి నారాయణ చెప్పారు. వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, హడ్కో.. ఇలా వివిధ సంస్థల నుంచి తీసుకువస్తున్న అప్పులతో అంతిమంగా ప్రజలపైనే భారం పడుతుందని ఆంధ్ర ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు చెప్పారు.''స్పెషల్ అసిస్టెన్స్ పేరుతో డబ్బులు ఇస్తున్నామని అంటున్నారు. వాటిని సీఆర్డీఏనే చెల్లించాలి. అది కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం కట్టాలి. రాష్ట్రం కట్టకపోతే కేంద్రంపై భారం పడుతుంది. కానీ, కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఆంధ్రప్రదేశ్ నుంచే రికవరీ చేస్తుంది'' అని ఆయన వివరించారు. అయితే, దీనిపై మంత్రి నారాయణ మాట్లాడుతూ, ప్రజలపై ఒక్క రూపాయి భారం పడకుండా అమరావతి నిర్మిస్తున్నామన్నారు.

''గతంలో ల్యాండ్ పూలింగ్‌లో సేకరించిన భూమిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కూడా ఇచ్చేశాం. అవి పోగా, సీఆర్డీయేకి 4 వేల ఎకరాల భూమి మిగులుతుంది. ఆ 4 వేల ఎకరాలను భవిష్యత్తులో వేలం వేసి, రాజధాని నిర్మాణానికి వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, హడ్కో వంటి సంస్థల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించేలా ప్రణాళికలు వేశాం'' అని బీబీసీ ఇంటర్వ్యూలో మంత్రి నారాయణ చెప్పారు.''అమరావతి అనేది సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నగరాన్ని నిర్మిస్తున్నాం'' అని ప్రకటిస్తూ వస్తున్నారు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.ఈ ఆర్థిక సంవత్సరం (202526) బడ్జెట్లో అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.6 వేల కోట్లు ప్రతిపాదించింది ఏపీ ప్రభుత్వం. ఇది ప్రతిపాదనే తప్ప కేటాయింపు కాదు.

### ఏపీ బడ్జెట్‌లో గత పదేళ్లగా అమరావతికి జరిగిన నిధుల కేటాయింపులు పరిశీలిస్తే..

201516 బడ్జెట్ - రూ.3,168 కోట్లు
201617 - రూ.1,500 కోట్లు
201718 - రూ.1,061 కోట్లు
201819 రూ.1,000 కోట్లు

2019లో జగన్ ప్రభుత్వ హయాంలో జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారు.అనంతరం, మూడు రాజధానుల విధానాన్ని తెరపైకి తీసుకొచ్చి వైసీపీ ప్రభుత్వం అమరావతిని పక్కనబెట్టింది. ఆ తర్వాత నిధుల కేటాయింపు జరగలేదు.మరోవైపు, 202526 బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లుగా ఉంటుందని సభకు చెప్పారు ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది మార్చి 31నాటికి రూ.5,62,557 కోట్లు అప్పు ఉందని మార్చి 25న లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంజక్ చౌదరి చెప్పారు.టీడీపీ ప్రభుత్వం 2019లో దిగేపోయే సమయానికి రూ.39,875 కోట్ల విలువైన పనులు నిర్మాణదశలో ఉన్నాయని అప్పట్లో సీఆర్డీఏ అధికారి ఒకరు చెప్పారని పేర్కొంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుడు జులైలో అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేసింది.ప్రకారం, 2019కి ముందు ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు, రోడ్లు, ఇతరత్రా మౌలిక వసతుల కోసం రూ.51,687 కోట్లు అవసరమని అంచనా వేసింది.ఇటీవల విలేఖరులతో మాట్లాడుతూ, 2014 19 మధ్య దాదాపు రూ.5 వేల కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి పి.నారాయణ చెప్పారు.అయితే, 2019కి ముందు రూ.51 వేల కోట్లతో అంచనాలు వేసిన ప్రభుత్వం, కేవలం 5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్న విమర్శలు కూడా వచ్చాయి.''అప్పటి ఖర్చులతో పోల్చితే భవనాలు, ఇతరత్రా వసతులకు సంబంధించి నిర్మాణ వ్యయం రూ.12,392 కోట్లకు పెరిగింది'' అని సీఆర్డీఏ తెలిపింది.ఇందులో ఐకానిక్ టవర్ల నిర్మాణం 2018లో అంచనా వ్యయం రూ.2271.14 కోట్లుగా ఉండేది. ప్రస్తుతం అంచనా వ్యయం రూ.4,688 కోట్లకు పెంచింది. మరోవైపు, తాజాగా అసెంబ్లీ భవన నిర్మాణం రూ.590 కోట్లు అంచనా కాగా... 4.48 శాతం ఎక్సెస్ తో ఎల్ అండ్ టీ సంస్థకు రూ.617 కోట్లకు పనులు అప్పగించింది.హైకోర్టు భవన నిర్మాణానికి రూ.750 కోట్లు అంచనా వ్యయం కాగా, 4.52 శాతం ఎక్కువకు రూ.786 కోట్లకు ఎన్సీసీ సంస్థకు పనులు అప్పగించింది.




## బీహార్ ఎన్నికలకు ముందు కులగణన ప్రకటన!

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుల ఆధారిత జనాభా గణనను ఆమోదించడం ద్వారా పెద్ద ట్రంప్ కార్డును వాడింది. కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కుల గణనను నిరంతరం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన పొలిటికల్ అఫైర్స్ కేబినెట్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన సమాచారం ఇస్తూ, తదుపరి జనగణన సందర్భంగా కులగణన కూడా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.ఈ కేబినెట్ కమిటీలో మోదీతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఉన్నారు.కాంగ్రెస్ ఎప్పుడూ కులగణనను వ్యతిరేకిస్తుందని వైష్ణవ్ అన్నారు. 2010లో అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కులగణన హామీ ఇచ్చారని, కానీ ఆ తర్వాత జరిగిందేమీ లేదని ఆయన అన్నారు.అదే సమయంలో బిహార్ రాజకీయాల్లో కాంగ్రెస్ మిత్రపక్షమైన ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ కూడా కుల గణనను డిమాండ్ చేస్తున్నారు. కానీ, మోదీ ప్రభుత్వం కుల గణనను ప్రకటించడం ద్వారా కాంగ్రెస్, RJD నుండి ఈ అంశాన్ని లాక్కున్నట్లు అయింది. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు కుల గణనకు సంబంధించి తమ వ్యూహాన్ని పునఃపరిశీలించవలసి ఉంటుంది. గత కొన్ని సంవత్సరాలుగా, రాహుల్ గాంధీ, ప్రతిపక్ష పార్టీలు కుల గణన డిమాండ్ కోసం కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నాయి. రాహుల్ గాంధీ తన ప్రసంగాలలో, ప్రచారాలలో చాలాసార్లు తన ప్రభుత్వం ఏర్పడితే కుల గణన నిర్వహిస్తామని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తి వేస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వం కులగణన చేస్తామని ప్రకటించడంతో ప్రతిపక్షాల వ్యూహాన్ని దెబ్బ కొట్టినట్లు అయింది. ఈ నిర్ణయం బీజేపీకి బీహార్ ఎన్నికలకు ముందు రాజకీయంగా చాలా కీలకంగా మారనుంది. దీని కారణంగా, ఒక ప్రధాన ఎన్నికల అంశం కాంగ్రెస్, ప్రతిపక్షాల చేతుల్లోంచి జారిపోయినట్లే.బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు కుల గణనను వ్యతిరేకించాయని బీజేపీ ఆరోపిస్తోంది. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన అన్ని జనాభా లెక్కల్లో కులాలను లెక్కించలేదని అన్నారు. కులాల సరైన జనాభా గణన నిర్వహించాలనే ఉద్దేశ్యాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ చూపించలేదని, 2010లో అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ లోక్‌సభలో కుల గణనను కేబినెట్‌లో పరిశీలిస్తామని చెప్పారని, అయితే దీని తర్వాత ఒక కేబినెట్ గ్రూప్ మాత్రమే ఏర్పడిందని, ఆ కమిటీ సిఫార్సులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల డేటాను సేకరించడానికి బదులుగా సామాజికఆర్థిక సర్వే మాత్రమే నిర్వహించిందని బీజేపీ ఆరోపించింది. కుల గణనను కాంగ్రెస్ రాజకీయ ఆయుధంగా మాత్రమే ఉపయోగిస్తున్నాయని బీజేపీ చెబుతోంది.కుల గణనలో దేశ పౌరుల కులం ఆధారంగా డేటాను సేకరిస్తారు. దీని వలన ఏ కులం, ఏ వర్గాల జనాభా ఇంకా సామాజిక ప్రయోజనాలను పొందలేదో తెలుస్తుంది. ఈ జనాభా గణనను మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. అయితే ఇప్పటివరకు సామాజికఆర్థిక జనాభా గణన మాత్రమే నిర్వహించారు.

### స్వాగతించిన రాహుల్ గాంధీ

కేబినెట్ నిర్ణయాన్ని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.''మేం కొంతకాలంగా కులగణన గురించి చెబుతూనే ఉన్నాం. మోదీ ప్రభుత్వం గతంలో దీనిని వ్యతిరేకించింది, ఏవేవో కారణాలు చూపింది. ఇప్పుడు, వాళ్లు అకస్మాత్తుగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.ఈ నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం. కానీ, దీని అమలుకి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను డిమాండ్ చేస్తున్నాం'' అని అందులో రాశారు.కులగణనకు తెలంగాణ రాష్ట్రం ఒక నమూనాగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. ఈసారి జరగనున్న జనగణన సందర్భంగా కులగణన కూడా చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర కేబినెట్ చారిత్రక నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.''జనగణనతో పాటే కులగణన చేపట్టడం మరింత పారదర్శకతను తీసుకొస్తుంది. రాజకీయ అవకతవకలకు అవకాశం లేకుండా చేస్తుంది'' అని ఆయన ఎక్స్‌లో రాశారు.కుల గణన నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్‌లో స్పందించారు.''నేడు, తెలంగాణ ఏం చేస్తుందో, దేశం దానిని రేపు అనుసరిస్తుందని నిరూపించాం'' అని ఆయన రాశారు.''రాహుల్ గాంధీ దిశానిర్దేశంలో, భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ.దానికి అనుగుణంగానే రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే నిర్వహించాం. రాష్ట్ర జనాభాలో 56.32 శాతం మంది వెనకబడిన కులాలకు చెందిన వారని తేలింది.తెలంగాణ శాసనసభలో సమర్పించిన నివేదిక ఆధారంగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించి, ప్రతిపాదనలు కూడా చేశాం.''అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 9న జరిగిన ఏఐసీసీ సమావేశంలో చేసిన తీర్మానం కాపీని జైరాం రమేశ్ పోస్ట్ చేస్తూ, ''అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 9 నాటి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంపై తీర్మానం చేసి, ఆమోదించింది. అసలు జరగకపోవడం కంటే, ఆలస్యంగానైనా జరగడం మంచిదే'' అని ఆయన రాశారు.

## భారతరత్న సత్యజిత్ రే



- భారతరత్న సత్యజిత్ రే
- నేడు దిగ్దర్శకుని జయంతి

ఆస్కార్ అవార్డ్ అందుకున్న తొలి భారతీయుడు సత్యజిత్ రాయ్ భారతదేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. ఆతను ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించాడు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో మే 2,1921 న జన్మించిన సత్యజిత్ రాయ్ కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలోనూ, రవీంద్రనాథ్ టాగోర్ స్థాపించిన శాంతినికేతన్ లోని విశ్వభారతి విద్యాలయము లోనూ చదివాడు. వ్యాపార కళాకారునిగా కెరీర్ ప్రారంభించిన రాయ్, లండన్ లో ఫ్రెంచి నిర్మాత జాన్ రెన్వాను కలిసాక, ఇటాలియన్ "నియోరియలిస్టు" సినిమా బైసికిల్ థీవ్స్ తరువాత సినిమాలు తీయడంపై ఆసక్తి పెంచుకున్నాడు. రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. ఆయనకి దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉంది. తన సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే (కథాగమనము), కేస్టింగ్ (నట సారథ్యము), సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము వంటివి కూడా ఆయనే చూసుకునేవాడు. సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నాడు.

1992లో, అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (ఆస్కార్) సత్యజిత్ రాయ్కి అకాడమీ గౌరవ పురస్కారం (ఆస్కార్ అవార్డు) అందించారు. గౌరవ ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగానూ, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగప్రముఖునిగానూ నిలిచారు. తాను మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, తన చలనచిత్ర జీవితంలో ఇది అత్యంత గొప్ప విజయంగా ప్రకటించారు.ఏప్రిల్ 23 1992 కొలకత్తా లో మరణించాడు.

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )



# ఆ నేతలు ఇద్దరు ఆల్ హ్యాపీసేనా..

- **టీడీపీ ఎమ్మెల్యే గంటా VS బీజేఎల్పీ విష్ణుకుమార్ రాజు**

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ (మే 01):**




మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మధ్య రేగిన వివాదాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మలుపు తిప్పారు. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీ సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కూటమి పార్టీలోని ఇద్దరు నేతలతో సమావేశమయ్యారు.వారిద్దరితో అసలేం మాట్లాడారో..? ఎలా సర్ది చెప్పారో కానీ, రెండు రోజుల క్రితం చిర్రుబుర్రులాడిన గంటా.. ఎమ్మెల్యే విష్ణుతో చేతులు కలిపారు. దీంతో ఆ ఇద్దరి మధ్య చెలరేగిన వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లేనని చర్చ జరుగుతోంది. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణంరాజు తొలి సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో రఘురామతోపాటు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు, జగన్మోహన్, కొణతాల రామకృష్ణ సభ్యులుగా ఉన్నారు. అయితే రెండు రోజుల క్రితం విశాఖ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు గంటా, విష్ణుకుమార్ రాజు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే.ఇది జరిగిన రెండు రోజులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ ఎంట్రీతో ఆ ఇద్దరి మధ్య గొడవకు శుభం కార్డు పడిందని అంతా చెబుతున్నారు. కూటమిలో ఉంటూ విపక్షంలా వ్యవహరించడం సరికాదన్న రీతిలో ఇద్దరూ ఇప్పుడు ఒక్కటైపోయారంట. పార్టీలు వేరైనా కూటమిలో కలిసికట్టుగా ఉంటూ విశాఖ అభివృద్ధి కోసం పాటుపడాలని ఇద్దరు సీనియర్ నేతలు కోరుకుంటున్నారని జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. విశాఖ ఫిల్మ్ నగర్ భూముల లీజు విషయంలో స్థానిక ఎమ్మెల్యే గంటాకు తెలియకుండా బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మిగిలిన ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం పంపడం వివాదానికి దారితీసింది. ఈ అంశంపై విశాఖ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక సందర్భంగా కలుసుకున్న విష్ణు, గంటా.. ఫిల్మ్ నగర్ లీజుల విషయంపై బహిరంగంగా వాదులాడుకున్నారు. ఈ విషయంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పినా, గంటా తీవ్ర మనస్థాపంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.విశాఖ ఫిలింనగర్ క్లబ్ కు గత ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమికి సంబంధించి కలెక్టర్ ను కలిసి విష్ణుకుమార్ రాజు లేఖ ఇవ్వడంపై గంటా మండిపడ్డారట. తన సంతకం లేకుండా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశంపై కలెక్టర్ కు లేఖ ఎలా ఇస్తారంటూ విష్ణుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారట.దీనిపై విష్ణుకుమార్ రాజు స్పందిస్తూ...ఫిల్మ్ క్లబ్ కు కేటాయించిన భూమి అలాట్ మెంట్ లెటర్లో 33 ఏళ్లు అనేది మిస్సయ్యిందని...దీనిపై కరెక్షన్ చేయడానికే కలెక్టర్ ని కలిసి లేఖ ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సంతకం తీసుకుని కలెక్టర్ కి ఇవ్వాలని..అలా జరక్కపోవడంతో గంటాకు విష్ణు సారీ కూడా చెప్పారట. దీంతో ఇద్దరి మధ్య తలెత్తిన విబేధాలు, రఘురామ ఎంట్రీతో సద్దుమణిగినట్టేనని అంటున్నారు. విష్ణు వర్సెస్ గంటా మధ్య గొడవలు ఇప్పటివి కావని..ఎప్పటినుంచో ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోందన్న చర్చ విశాఖ జిల్లా రాజకీయాల్లో నడుస్తోంది. ఎందుకంటే విశాఖ ఉత్తర నియోజకవర్గానికి విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యే. దాన్ని ఆయన కంచుకోటగా మార్చుకున్నారు. 2014లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీబీజేపీ అభ్యర్థిగా రాజు గెలుపొందారు.ఆనాటి నుంచి నియోజకవర్గంలో ఆయనకు మంచి సంబంధాలే ఉన్నాయట. 2019లో అదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, టీడీపీ నుంచి గంటా, వైసీపీ నుంచి కేకేరాజు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గంటా విజయం సాధించారు. ఆ తర్వాత గంటా, రాజుకు మధ్య మాటలయుద్ధం తారస్థాయిలో ఉండేదట. ఒకరినొకరు ముఖం చూసుకోని స్థాయికి వెళ్లిపోయాయని వారి సన్నిహితుల మధ్య టాక్ విన్పిస్తోంది.అయితే, నిన్నటి వరకు కయ్యానికి కాలుదువ్విన ఇద్దరు నేతలు.. ఇప్పుడు ఆల్ హ్యాపీస్ అంటూ చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నా, లోలోపల మాత్రం మంట రగులుతూనే ఉంటుందని ఆ నియోజకవర్గం నేతలు మాత్రం గుసగుస లాడుకుంటున్నారట. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో..ఇలాగే కలిసిమెలిసి ఉంటారా లేక మళ్లీ రోడ్డెక్కి రచ్చ చేస్తారా అనేది చూడాలి.



## తెలంగాణలో కులగణన తూతూమంత్రమే: కిషన్‌రెడ్డి

**జర్నలిస్ట్ డైరీ, తెలంగాణ (మే 01):**

బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. దిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. “2011 జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగపడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు” అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# ఐరన్ స్క్రాప్ తో మోడీ విగ్రహం

- **ప్రత్యేక ఆకర్షణగా వెలకమ్ అమరావతి**

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ (మే 01):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నారు. మే 2న పునర్నిర్మాణ పనులకు మోదీ శంఖుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని సభ వేదిక వద్దకు వెళ్లే సమయంలో ఆయన ప్రత్యేక విగ్రహాన్ని తిలికించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆటో మొబైల్ స్క్రాప్‌తో చేసిన మోదీ విగ్రహంతో పాటు వెలకమ్ అమరావతి లెటర్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ఒక స్టాండ్ ఏర్పాటు చేశారు.తెనాలికి చెందిన సూర్య శిల్ప శాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరావు ఆయన తనయులు రవిచంద్ర, సూర్య కుమార్ మోడ్రన్ ఆర్ట్ లో నిష్ణాతులు. ఇప్పటికే ఎన్నో రకాల విగ్రహాలను తయారు చేసి ప్రత్యేక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే ఐరన్ స్క్రాప్ తో తయారు చేసిన మోదీ విగ్రహం కూడా ఉంది. ఆటో మొబైల్ రంగంలో ఉపయోగించే నట్టులు, బొల్టుల సాయంతో ఎత్తైన విగ్రహాలు తయారు చేశారు. ప్రముఖుల విగ్రహాలతో పాటు బైసన్, జీపు, సింహం, సైకిల్ వంటి వస్తువులను స్క్రాప్ తో తయారు చేశారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ అమరావతి వస్తున్న సందర్భంగా లక్షలు ఖర్చు చేసి అనేక విగ్రహాలను తయారు చేశామని వాటిన సభ వద్ద ప్రదర్శనగా ఉంచేందుకు అనుమతి తీసుకున్నట్లు వెంకటేశ్వరావు తెలిపారు.సభ వద్ద మోదీ విగ్రహంతో పాటు ఎన్టీఆర్, బుద్దుడు, సింహం, సైకిల్ తో పాటు తెలుగు దేశం పార్టీ సింబల్ ను కూడా ఐరన్ స్క్రాప్ తోనే తయారు చేసి ప్రదర్శనకు ఉంచారు. వీటితో పాటు అమరావతి పేరును కూడా తీగతో ఆకట్టుకునేలా రూపొందించారు. వీటన్నింటిని సభకు వచ్చే ప్రముఖులతో పాటు ఇతరులు తిలకించాలనేది తమ కోరిక అని శిల్పి రవిచంద్ర తెలిపారు. తెనాలి ప్రాంతం శిల్పకళకు పెట్టిందిపేరని గతంలోనూ అనేక అవార్డులు పొందినట్లు శిల్పులు తెలిపారు. మోడీ తో పాటు ఇతరలు విగ్రహాలను ఆకట్టుకునేలా రూపొందించిన శిల్పులను పలువురు అభినందిస్తున్నారు.




# ఎట్టకేలకు ఖనిజాల ఒప్పందంపై

- **సంతకం చేసిన ఉక్రెయిన్-అమెరికా**

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**

ఉక్రెయిన్‌అమెరికా (Ukraine USA) మధ్య ఎట్టకేలకు అరుదైన ఖనిజాల తవ్వకాల ఒప్పందం కుదిరింది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్, ఉక్రెయిన్ ఫస్ట్ డిప్యూటీ ప్రధాని యులియా సిర్డెంకో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో ఉక్రెయిన్‌లో అరుదైన సహజ వనరులు అయిన అల్యూమినియం, గ్రాఫైట్, చమురు, సహజ వాయువు, ఇతర ఖనిజాలను తవ్వుకునేందుకు అమెరికాకు అనుమతి లభించినట్లైంది. ఈ ఒప్పందం కుదరడం వల్ల ఉక్రెయిన్‌లో అమెరికా సంయుక్త నిధిని ఏర్పాటు చేయనుంది. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి చేపట్టాల్సిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల్లో యూఎస్ పెట్టుబడిదారులకు ప్రాధాన్యత లభించనుంది. ఈ ఒప్పందం కుదరడంపై అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పోస్టు చేసింది. “ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి కావాల్సిన ఉమ్మడి పెట్టుబడి నిధిని స్థాపించడానికి ఉక్రెయిన్, అమెరికాలు సంతకం చేశాయి. స్వేచ్ఛాయుత, సార్వభౌమ, సంపన్నమైన ఉక్రెయిన్ కోసం ట్రంప్ నిబద్ధతను ఈ చరిత్రాత్మక ఆర్థిక భాగస్వామ్యం సూచిస్తుంది” అని తెలిపింది. రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు తాము చొరవ తీసుకుంటామని, అందుకు బదులుగా ఉక్రెయిన్‌లో ఖనిజాల తవ్వకానికి తమను అనుమతించాలని యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేయాల్సి ఉండగా, ఓవల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య మీడియా ముందే మాటల యుద్ధం జరిగింది. దీంతో అప్పటినుంచి ఇది అలాగే ఉండిపోయింది. అయితే ఈ ఒప్పందం కోసం ఇరుదేశాలు చాలా రోజులుగా తెరవెనుక ప్రయత్నాలు సాగించాయి. ఎట్టకేలకు ఇరుపక్షాలు అంగీకరించాయి.



# తదుపరి పోప్ ఎవరు?

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**

క్రైస్తవుల అత్యున్నత ఆధ్యాత్మిక గురువుగా వ్యవహరించే పోప్ స్థానం కోసం పోటీ పడుతున్న అభ్యర్థులెవరన్న విషయంపై మిస్టరీ కొనసాగుతోంది. మే 7న పోప్ ఎంపిక ప్రక్రియ ప్రారంభమయ్యాక గానీ ఈ విషయంపై స్పష్టత రాకపోవచ్చు. 1978కి పూర్వం పోప్ పదవిపై ఇటలీ దేశస్థుల గుత్తాధిపత్యం సాగేది. పోలండ్‌కు చెందిన జాన్‌పాల్ 2 ఈ స్థానానికి ఎంపికై తరతరాల సంప్రదాయానికి అడ్డుకట్ట వేశారు. నాటి నుంచీ ప్రపంచంలోని ఏ దేశానికి చెందినవారైనా పోప్ పదవి కోసం పోటీ పడే అవకాశం ఏర్పడింది. తాజాగా పోప్ ఫ్రాన్సిస్ వారసుణ్ని ఎంపిక చేయడానికి ప్రపంచం నలుమూలల నుంచి కార్డినళ్లు (మత గురువులు) సిస్టీన్ చాపెల్ (చర్చి)లో మే 7 నుంచి సమావేశం కానున్నారు. రహస్యంగా సాగే ఈ ఎన్నిక ప్రక్రియలో ఎవరు విజేతలవుతారు, ఎవరెవరు పోటీ పడుతున్నారు అన్న విషయంపై అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రస్తుతానికి ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు ఇవీ... కార్డినల్ పియెట్రో పారోలిన్ (ఇటలీ), కార్డినల్ లూయిా ఆంటోనియో టాగ్లే (ఫిలిప్పీన్స్), కార్డినల్ ఫ్రిడోలిన్ అంబోంగో బెసుంగు (కాంగో), కార్డినల్ మట్టియో జుప్పి (ఇటలీ), కార్డినల్ పీటర్ ఎర్డో (హంగరీ). ఒక పోప్ అస్తమించి మరొకరు ఎన్నికయ్యే వరకూ సాగే సంధికాలంలో వాటికన్‌లో ప్రత్యేక తపాలా బిళ్లలు చలామణీ అవుతాయి. వీటిని ‘సెడె వెకాంట్’ స్టాంపులని పిలుస్తారు. ఈ తపాలా బిళ్లలు తదుపరి పోప్ ఎన్నికయ్యే వరకూ మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఆ స్టాంపులు కొత్త పోప్ రాకతో చెల్లుబాటు కాకుండా పోయినా, స్టాంపుల సేకర్తలకు అవి అమూల్యంగా మారతాయి, అని ఇక్కడ ఒక స్టాంపుల సేకరణ కేంద్రం నిర్వహిస్తున్న ఒక వ్యక్తి అన్నారు. ఈ స్టాంపుల్లో రెండు తాళం చెవుల చిహ్నం ఉంటుంది. అయితే సాధారణ కాలపు స్టాంపుల్లో మాదిరిగా పోప్ ధరించే శిరస్త్రాణ చిహ్నం ఉండదు.

నేనే పోప్ అవుతా ఓ విలేకరితో ట్రంప్ సరదా వ్యాఖ్య తదుపరి పోప్‌ను ఎంపిక చేసే అవకాశం వస్తే..“నేనే పోప్‌ను అవుతా. అదే నా మొదటి ఎంపిక” అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక టెలివిజన్ మీడియా విలేకరి అడిగిన ప్రశ్నకు సరదాగా సమాధానమిచ్చారు. “న్యూయార్క్‌లో మనకూ ఒక కార్డినల్ ఉన్నారు. ఆయన చాలా మంచివారు. ఏమవుతుందో చూద్దాం” అని ట్రంప్ తదుపరి పోప్ అమెరికా నుంచి ఎంపిక అవుతారా అన్న ప్రశ్నకు బదులిచ్చారు.




## పదకొండేళ్ల విద్యార్థితో కలిసి
# 4 రాష్ట్రాలు దాటిన లేడీ టీచర్..

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం (మే 01):**

గుజరాత్‌లోని సూరత్ నగరానికి చెందిన ఓ యువ ఉపాధ్యాయురాలు (23) తన వద్ద ట్యూషనుకు వచ్చే 11 ఏళ్ల విద్యార్థితో కలిసి అదృశ్యమైన కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుజరాత్‌లోని సూరత్ నగరానికి చెందిన ఓ యువ ఉపాధ్యాయురాలు (23) తన వద్ద ట్యూషనుకు వచ్చే 11 ఏళ్ల విద్యార్థితో కలిసి అదృశ్యమైన కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నాలుగు రాష్ట్రాలు దాటిన వీరిద్దరూ బుధవారం తెల్లవారుజామున రాజస్థాన్ సరిహద్దులో ఓ ప్రయివేటు బస్సులో ఉండగా అదుపులోకి తీసుకొని, సూరత్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఉపాధ్యాయురాలు తన కుమారుణ్ని కిడ్నాప్ చేసినట్లు విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేయడంతో ఈ కేసు ఆసక్తికరంగా మారింది. ప్రాథమిక దర్యాప్తు మేరకు.. ఇద్దరూ తమ తమ ఇళ్లలో కుటుంబసభ్యుల తిట్లు పడలేక వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్నట్లు తేలింది. అదే ప్రాంతంలో గత రెండు మూడేళ్లుగా నివసిస్తున్న వీరిద్దరి కుటుంబాలకు పరస్పర పరిచయాలు ఉన్నట్లు డీసీపీ భగీరథ్ గఢవీ తెలిపారు. సీసీటీవీ ఫుటేజి ఆధారంగా ఇద్దరూ కలిసి వెళ్లినట్లు గుర్తించారు. బాలుడి వయసు 11 ఏళ్ల కంటే ఇంకా ఎక్కువ ఉంటుందని అనుమానిస్తున్న పోలీసులు.. వారిద్దరి అనుబంధం ఎలాంటిదన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.





# ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో ఆసక్తికరమైన కేసు

- **గడ్డం తీసేది లేదన్న భర్త. మరిదితో వదిన పరార్..**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం (మే 01):**

ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో ఆసక్తికరమైన కేసు తాజాగా వెలుగులోకి వచ్చింది. భర్త గడ్డం నచ్చని ఓ మహిళ.. క్లీన్‌షేవ్‌తో కళ్ల ముందు తిరుగాడుతున్న మరిదితో కలిసి ఇంటి నుంచి పరారైంది. మేరఠ్‌లోని లిసాడి గేట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. భార్య నిర్ణయంతో కలత చెందిన భర్త పోలీసులను ఆశ్రయించాడు. మౌలానా షకీర్‌కు అర్షి అనే యువతితో ఆర్నెల్ల కిందట పెళ్లి జరిగింది. 12వ తరగతి వరకు చదువుకొన్న ఈమె కళాశాల చదువు కొనసాగిస్తోంది. తొలిరాత్రే భర్త గడ్డంపై అర్షి అభ్యంతరం తెలిపింది. గడ్డం తీసేది లేదని షకీర్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఇదే విషయమై ఆమె తనతో చాలాసార్లు గొడవకు దిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన తెలిపారు. షకీర్ ప్రతిరోజు ఉదయం పనికి వెళ్లిపోయాక.. ఇంట్లో ఆయన తల్లి, సోదరుడు ఉండేవారు. ఈ క్రమంలో క్లీన్‌షేవ్‌తో కనిపించే షకీర్ సోదరుడు ఆమెకు చేరువై.. ఇద్దరూ కలిసి ఎటో వెళ్లిపోయారు. ఈ విషయం అర్షి తల్లిదండ్రులకు తెలిసి ఆమెతో ఇకపై తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పేశారు. షకీర్ ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులు తప్పిపోయినట్లుగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మేరఠ్ సిటీ ఎస్పీ ఆయుష్ విక్రమ్‌సింగ్ మీడియాకు తెలిపారు.




# జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను

- **అనుసంధానం చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం (మే 01):**

కేంద్ర ఎన్నికల సంఘం (Election Commission) కీలక నిర్ణయం తీసుకుంది. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా (voters list)ను అనుసంధానం చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (RGI) నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. తద్వారా అత్యంత కచ్చితత్వంతో ఓటరు జాబితాను నవీకరించే వీలుంటుందని పేర్కొంది. కులగణనకు సై.. జనాభా లెక్కలతో పాటే వివరాల సేకరణ “నమోదిత మరణాలకు సంబంధించిన సమాచారాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ERO) సకాలంలో పొందే వీలుంటుంది. చనిపోయిన వారి కుటుంబీకుల నుంచి విజ్ఞప్తి వచ్చేంతవరకు వేచి చూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు (BLOs) క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారు” అని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల నిబంధనలు 1960, జనన, మరణాల నమోదు చట్టం 1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారాన్ని తీసుకునే అధికారం ఉంది. బీఎల్ఓలకు ఐడీ కార్డులు.. ఓటరు సమాచార చీటీ (VIS) మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజును పెంచనున్నట్లు తెలిపింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను తేలికగా గుర్తించడంతోపాటు అటు పోలింగ్ అధికారులకు కూడా జాబితాలోని పేర్లను సులభంగా సరిచూసుకునే వీలుంటుంది. దీంతోపాటు బూత్ స్థాయి అధికారులకు కూడా ఫొటో ఐడీ కార్డులను జారీ చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

## అంబర్ పేటలో మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**జర్నలిస్ట్ డైరీ, అంబర్‌పేట్ (మే 01) :**

కేంద్ర ప్రభుత్వం జనాభా గణనతో పాటు కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా సెంట్రల్ జిల్లా అధ్యక్షులు వినోద్ యాదవ్, కార్పొరేటర్ అమృతలు అన్నారు. కుల గణన చేపట్టాలని నిర్ణయించడంతో ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 1930 సంవత్సరంలో కుల గణన చేపట్టడం జరిగిందని, తిరిగి ఇప్పుడే కులగణన చేపట్టాలని ప్రధాని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగభూషణం చారి, రవీందర్ గౌడ్, పెంటమ్ రాజు, రాజునేత, మనోజ్ యాదవ్, యశ్వంత్, ఈశ్వర్, వెంకట్ స్వామి, శివ శంకర్ రెడ్డి, మైలారం రాజు, జగన్ యాదవ్, మహేష్,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





# టారిఫ్‌లపై చర్చిద్దాం రండి, చైనాను సంప్రదించిన అమెరికా..

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**

టారిఫ్‌లపై చర్చల కోసం అమెరికా అధికారులు చైనాను వివిధ మార్గాల్లో సంప్రదించినట్లు బీజింగ్‌కు చెందిన ఓ పత్రిక పేర్కొంది. టారిఫ్‌లపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. ఈ విషయాన్ని బీజింగ్‌కు చెందిన ఓ మీడియా సంస్థ వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పంపిణీ వ్యవస్థలు దెబ్బతినకుండా ఈ చర్యలు చేపట్టినట్లు అభివర్ణించింది. ట్రంప్ సర్కారు ఇప్పటికే చైనా వస్తువులపై ఏప్రిల్‌లో 145శాతం సుంకాలు విధించింది. దీనికి ప్రతి స్పందనగా బీజింగ్ కూడా అగ్రరాజ్య వస్తువులపై 125శాతం సుంకాలను విధించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధికారులు వివిధ మార్గాల్లో చైనీయులను సంప్రదించినట్లు సీసీటీవీ పేర్కొంది. సంప్రదింపుల కోసం అమెరికానే ఆత్రుతతో ఎదురు చూస్తోందని వెల్లడించింది. ట్రంప్ కార్యవర్గం తీవ్ర ఒత్తిడిలో ఉందని చెప్పింది. ఈ విషయంపై చైనా విదేశాంగ శాఖ నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్ర స్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధవారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కదుర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. ''చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకోనున్నాం. అదే మంచిది'' అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్ హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా.. చైనా బహిరంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ ''ఇరు దేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడంలేదు. వాణిజ్య ఒప్పందం కుదరలేదు'' అని చెప్పారు. అయితే ఈ అంశంపై భవిష్యత్తులో చర్చలకు సిద్ధమే అని చెప్పడం విశేషం.




# నీట్' పరీక్షపై అసత్య ప్రచారం..

- **120కి పైగా టెలిగ్రామ్, ఇన్‌స్టా ఛానళ్లపై చర్యలు..**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం (మే 01):**

నీట్ పరీక్షపై అసత్యప్రచారం చేస్తున్న దాదాపు 120కి పైగా సామాజిక మాధ్యమ ఛానళ్లను ఎన్‌టీఏ గుర్తించింది వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (యూజీ) పరీక్షకు (NEET UG 2025) సంబంధించి అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఎన్‌టీఏ(NTA) చర్యలు చేపట్టింది. ఈ పరీక్షపై తప్పుదారిపట్టించే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్న దాదాపు 120కి పైగా సామాజిక మాధ్యమ ఖాతాల్ని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వీటిలో 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టాగ్రామ్ ఛానళ్లు ఉన్నట్లు ఎన్‌టీఏ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఛానళ్లపై తదుపరి దర్యాప్తు కోసం కేసులను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. అలాగే, అసత్య ప్రచారాన్ని, విద్యార్థుల్లో అనవసర భయాందోళనల్ని నివారించేందుకు ఈ ఛానళ్లను తొలగించాలని టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలను సైతం కోరినట్లు తెలుస్తోంది. నీట్ ప్రశ్నపత్రం గురించి తప్పుడు ప్రచారం చేసే అనధికార వెబ్‌సైట్‌లు/సోషల్ మీడియా ఖాతాలు; పరీక్ష కంటెంట్ యాక్సెస్‌కు సంబంధించి క్లెయిమ్ చేసే వ్యక్తుల గురించి ఫిర్యాదు చేసేందుకు ఎన్‌టీఏ ఇటీవల కొత్త వేదికను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించి అనుమానాస్పద కంటెంట్ ప్రచారం చేసినట్లు గుర్తిస్తే https://neetclaim.centralindia.cloudapp.azure.com/ ద్వారా రిపోర్టు చేయవచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 1500కు పైగా ఫిర్యాదులు అందగా.. వీటిలో అధిక భాగం టెలిగ్రామ్ ఛానల్ లింక్‌లే ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ ఏడాది మే 4న జరగనున్న నీట్ యూజీ పరీక్షకు రంగం సిద్ధం చేసింది. నీట్ అడ్మిట్ కార్డుల్ని నిన్ననే విడుదల చేసింది.

# చెరువుల అభివృద్ధికి కృషి

- **పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 01) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువులను సుందరీకరించడం జరుగుతుందని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని తమ్మిడి కుంట చెరువు సుందరీకరణలో భాగంగా హైడ్రా ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను హైడ్రా అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని 64 చెరువులను సుందర శోభితవనంలుగా తీర్చిదిద్దుతామన్నారు. మన భవిష్యత్తు తరాలకు ఆస్తుల బదులు మంచి ఆరోగ్యం, ప్రశాంత జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసిపడుదామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే ధ్యేయంగా పనిచేస్తానని, చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయన్నారు. జీవ వైవిధ్యం పెరుగుతుందని, పక్షుల వలసలు మొదలవుతాయని తెలిపారు. చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనబడే దేవుళ్ళతో సమానమని తెలిపారు. చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందని అన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో సుందరీకరణ చేపట్టుటకు ముందుకు రావడం చాలా అభినందించదగ్గ విషయమని, సమాజ హితం, సమాజ సేవ చేయడం కోసం ముందుకు రావడం చాలా గర్వించదగ్గ విషయమని, హైడ్రా ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పారు. తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని చెప్పారు. చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువులు కలుషితం కాకుండా, కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయిలో సంరక్షిస్తామని, చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి, ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చెప్పారు. చెరువు చుట్టుపక్కల కాలనీ వాసులు, ప్రజలు చెరువును సంరక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా సామాజిక బాధ్యతతో సంరక్షించుకోవాలని, చెరువుల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా డీఈ నాగరాజు, డీఈ మోహన్, హైడ్రా టెక్నికల్ కన్సల్టెన్సీ యూనిస్, సిబ్బంది నాయకులు ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసీపీ ఖేల్ ఖతమ్. దుకాణ్ బందేనా.

- **వైసీపీలో అసంతృప్తితో రగిలిపోతున్న కార్పొరేటర్లు.**

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ (మే 01):**



ఏపీలో ఒక్కొక్కటిగా మున్సిపల్ కార్పొరేషన్లన్నీ కూటమి ఖాతాలోకి చేరుతున్నాయి. వైసీపీ కైవసం చేసుకున్న మేయర్ పీఠాలన్నింటిని కూటమి దక్కించేందుకు వ్యూహాలకు పదును పెడుతోంది. కొద్ది రోజుల క్రితం విశాఖ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న కూటమి..తాజాగా గుంటూరు నగరపాలక సంస్థను కైవసం చేసుకుంది.ఈ రెండింటితో పాటు ఇప్పటికే నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, ఏలూరు, జగ్గయ్యపేట, విజయవాడ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లంతా టీడీపీజనసేన బీజేపీలో చేరుతుండటంతో మెజారిటీ కోల్పోయిన ఆయా స్థానిక సంస్థల్లో వైసీపీ అధికారం కోల్పోతోంది. వైసీపీలో అసంతృప్తితో రగిలిపోతున్న కార్పొరేటర్లు, వ్యాపార అవసరాలకోసం కొందరు, తమ డివిజన్లలో అభివృద్ధి పనులు చేయించుకోడానికి కొందరు, వచ్చే కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లో ఇప్పటి నుంచే సీటు రిజర్వేషన్‌కు కొందరు..ఇలా ఎవరికి వారు తమ తమ అవసరాల కోసం పార్టీలు మారారు.దీంతో వైసీపీకి మెజార్టీ తగ్గిపోవడంతో కూటమి నేతలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి వారిని ఓడిస్తున్నారు. విజయవాడ తప్పించి మిగతా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కూటమి అధికారం సొంతం చేసుకుంది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా త్వరలో అవిశ్వాసం పెట్టే అవకాశం ఉందన్న చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని ఆ పార్టీ కార్పొరేటర్లు అంటున్నారట. ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్లు, కార్పొరేషన్లలో మేయర్లు వైసీపీకి అనుకూలంగా పనిచేశారే తప్ప ప్రజాప్రతినిధులుగా పనిచేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు వినతులు ఇచ్చినా మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు పట్టించుకోలేదని.. దాంతో ప్రజల దృష్టిలో తాము చులకనైపోయినట్లు వైసీపీ కార్పొరేటర్లు వాపోతున్నారట.ఇలాంటి పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో ఏ జిల్లాలోనూ కనీస మెజార్టీ లేకపోవడంతో కూటమికి అన్ని విధాలుగా పైచేయి లభించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రహదారులు, మంచినీటి సమస్య, డ్రైనేజి ఇతర మౌలిక సదుపాయాలు వంటి సమస్యలన్నింటినీ పరిష్కరించే ప్రయత్నం చేయడంతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని టాక్.వైసీపీ అధికారం కోల్పోవడంతో వైసీపీ మేయర్లంతా ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారట. అప్పటికే అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమి పార్టీలు ఆహ్వానించాయి. దీంతో ఎవరి అవసరం కోసం వారు ఆయా పార్టీల్లో చేరిపోయారు. మెజార్టీ పెరిగిన కూటమి పార్టీలు ఆయా కార్పొరేషన్లలో మేయర్లపై అవిశ్వాసం పెట్టించారు. వైసీపీ ఓడిపోవడంతో ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లన్నీ కూటమి పార్టీల చేతుల్లోకి వెళ్లిపోయాయి.వారంపది రోజుల వ్యవధిలోనే వైసీపీకి చెందిన GVMC, గుంటూరు కార్పొరేషన్ మేయర్ పీఠాలు కూటమిఖాతాలోకి చేరిపోయాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో వైసీపీకి చెందిన మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై ఏప్రిల్ 19న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మొత్తం 111 మంది సభ్యులు కలిగిన కౌన్సిల్‌లో కూటమికి 2/3 వంతు ఆధిక్యం దక్కడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పదవీచ్యుతులయ్యారు.మేయర్ ఎన్నికను వైసీపీ బహిష్కరించడంతో GVMC మేయర్ గా కూటమి అభ్యర్థి పిలా శ్రీనివాస్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్ ఇప్పుడు కూటమి ఖాతాలోకి చేరింది. ఇదిలా ఉంటే ఇక గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కూడా కూటమి ఖాతాలో చేరింది. గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్ నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. దాంతో గుంటూరు మేయర్‌గా కూటమి అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర గెలుపొందరు. నిన్నటి వరకు ఏ పార్టీ అభ్యర్థి కూడా పోటీ చేయకపోవడంతో అంతా ఏకగ్రీవం అనుకున్నారు. అయితే సోమవారం ఉదయం వైసీపీ నుంచి అచ్చాల వెంకటరెడ్డి పోటీలో నిలిచారు. దీంతో ఎన్నిక జరగ్గా. కూటమి అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర విజయం సాధించారు.ఏపీలోని వైసీపీ మేయర్ పీఠాలన్నీ కూటమిలోకి వచ్చి చేరుతుండడంతో..ఆయా కార్పొరేషన్లలో విపక్ష వైసీపీ పని అయిపోయిందన్న టాక్ ఏపీ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. రాబోయే మరిన్ని మేయర్ పీఠాలను తనలో కలిపేసుకునేందుకు కూటమి పావులు కదుపుతుందన్న చర్చ జరుగుతోంది. ఒక్కో కార్పొరేషన్ చేజారిపోతుండడంతో..వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ఇక రాబోయే కాలమంతా గడ్డుకాలమే ఎదురుకానుందన్న టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతోంది. కూటమి పవర్ ను తట్టుకోవడం అంత సులభమైన పనికాదని..అందుకు జగన్ చాలా కసరత్తు చేయాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి



# భారత్ కు బిగ్ రిలీఫ్

- **అమెరికా భారత్‌పై విధించిన 26శాతం సుంకాలు తగ్గనున్నాయా..?**
- **గుడ్ న్యూస్ రానుందా..?**

**జర్నలిస్ట్ డైరీ, న్యూఢిల్లీ (మే 01):**

అమెరికా భారత్‌పై విధించిన 26శాతం సుంకాలు తగ్గనున్నాయా..? గుడ్ న్యూస్ రానుందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు సంబంధించి రెండు దేశాల మధ్య త్వరలోనే డీల్ కూడా కుదిరే అవకాశాలు ఉన్నాయి. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇదే హింట్ ఇచ్చారు. భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. వందరోజుల పాలన పూర్తైన సందర్భంగా వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఒప్పందాన్ని ప్రస్తావించారు ట్రంప్. భారత్‌తో టారిఫ్ చర్చలు జరుగుతున్నాయని.. ఇటీవల ప్రధాని మోదీ అమెరికాకు వచ్చిన సమయంలో సుంకాలపై ఒక ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. త్వరలోనే అది కార్యరూపం దాలుస్తుందని భావిస్తున్నా అంటూ ట్రంప్ పేర్కొన్నారు.భారత్‌తో డీల్‌పై అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య టారిఫ్ చర్చల్లో పురోగతి కనిపిస్తోందన్నారు. దీనిపై త్వరలో ఢిల్లీ ఒక ప్రకటన చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇండియా లాంటి సానుకూలమైన దేశాలతో చర్చలు జరపడం సులభమన్నారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. తమ దగ్గర ఒక వాణిజ్య ఒప్పందం ఉందని, కానీ దానికి ఆ దేశ ప్రధాని, పార్లమెంటు ఆమోదం తెలపాలన్నారు. అయితే, అది భారత్‌తోనే అయి ఉండొచ్చని తెలుస్తోంది.ఇటీవల ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల మోత మోగించారు. అనంతరం 90 రోజుల పాటు ఈ సుంకాల అమలుకు అమెరికా విరామం ప్రకటించింది. ట్రంప్ విధించిన సుంకాలపై .. చాలా దేశాలు ప్రతీకార చర్యలకు సైతం దిగాయి. అయితే, భారత్ మాత్రం భిన్నంగా ఆలోచించి.. ప్రతి సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టి సారించి.. సఫలికృతమైంది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడ్డాయి. ఇరు దేశాల ప్రయోజనాలు.. పరిస్థితులకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. ఇదే సమయంలో సుంకాలపై కూడా చర్చలు తుది దశకు వచ్చినట్లు తెలుస్తోంది.

# జీఎస్టీ వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డ్




- **ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్లుగా నమోదైంది.**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం (మే 01):**

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో (GST collections) సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఈ మొత్తంగా రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. అంతకుముందు నెలలో (మార్చి) జీఎస్టీ వసూళ్లు 1.96 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 10.7 శాతం మేర పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.46,913 కోట్లకు పెరిగింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి, రూ.90వేల కోట్ల స్థాయి నుంచి దేశంలో వివిధ రకాల పరోక్ష పన్నుల స్థానే 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. తొలి నెల రూ.92వేల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. ఆరంభంలో ఎదురైన కొన్ని రకాల సవాళ్ల కారణంగా ఆ ఏడాదంతా అదే స్థాయిలో వసూళ్లు నమోదయ్యాయి. 2018 ఏప్రిల్‌లో తొలిసారి జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల రూపాయలు దాటాయి. కొవిడ్ కారణంగా రెండేళ్ల పాటు వసూళ్లు నెమ్మదించాయి. మళ్లీ 2022 ఏప్రిల్‌లో రూ.1.67 లక్షల కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. ఆ పై ప్రతి నెలా రూ.1.50 లక్షల కోట్లు పైనే వసూళ్లు నమోదవుతూ వచ్చాయి. తొలిసారి 2024 ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు మార్కు దాటింది. సరిగ్గా ఏడాది తర్వాత రికార్డు వసూళ్లు నమోదు కావడం గమనార్హం.

# రేషన్ బియ్యం విక్రయిస్తే లబ్ధిదారులకు రేషన్ కార్డు రద్దు

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్**

**జర్నలిస్ట్ డైరీ, మంచిర్యాల బ్యూరో (మే 01) :**



అర్హులైన నిరుపేద ప్రజలకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ఈ బియ్యం విక్రయించిన లబ్ధిదారుల రేషన్ కార్డు రద్దు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. చౌక ధరల దుకాణాల ద్వారా జిల్లాలోని తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన 11 మంది రేషన్ కార్డుదారులు తాము ప్రభుత్వం ద్వారా పొందిన సన్నబియ్యంను విక్రయించిన సమాచారం మేరకు సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డులు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. 11 మంది రేషన్ కార్డుదారులు అచలాపూర్ గ్రామానికి చెందిన కుంకుమొట్టి మహేష్ కు బియ్యం విక్రయించిన సమాచారంతో మహేష్ నివాసంలో తనిఖీలు చేయగా సన్నబియ్యం విలువలు లభించాయని, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం సంబంధిత రేషన్ కార్డుదారుల కార్డులను రద్దు చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదల కోసం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం విక్రయించినట్లయితే సంబంధిత కార్డులు రద్దు చేయడంతో పాటు కార్డుదారులు, బియ్యం కొనుగోలు చేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# డ్రోన్లతో నిఘా.. 4KM మేర సీసీటీవీలు..

- **పహల్గాం దాడితో ఉగ్ర గురువుకు నాలుగింతల భద్రత**

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి వెనక లష్కరే తోయిబా కుట్ర ఉందనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ దాడి తర్వాత నుంచి లష్కరే చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్ కు పాక్ ప్రభుత్వం అమాంతం భద్రత పెంచడమే ఇందుక్కారణం..! గతంతో పోలిస్తే అతడి భద్రతను నాలుగింతలు పెంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లాహోర్‌లోని అత్యంత రద్దీగా ఉండే నివాస సముదాయాల నడుమ హఫీజ్ సయీద్ నివసిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. అతడి ఇంటి చుట్టూ పాక్ (Pakistan) ఆర్మీ, ఐఎస్ఐ, లష్కరే ముఠా నిరంతరం పహారా కాస్తున్నట్లు తాజా సమాచారం. దీంతోపాటు కాంపౌండ్ చుట్టూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా డ్రోన్లతో నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇక, హఫీజ్ ఇంటికి నలువైపులా 4 కిలోమీటర్ల పరిధిలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను అమర్చారట..! పాక్ మరో ఎత్తుగడ ఐఎస్ఐ చీఫ్‌కు కీలక బాధ్యతలు లష్కరే చీఫ్ ఇంటి సమీపంలోకి సామాన్య పౌరులెవరినీ అనుమతించడం లేదని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్మీకి చెందినవి కాకుండా.. ఇతర డ్రోన్లపై నిషేధం విధించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా.. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం హఫీజ్ సయీదేనని భారత నిఘా వర్గాలు ఇప్పటికే అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అతడిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరగొచ్చన్న అంచనాలతో లష్కరే చీఫ్‌కు పాక్ భద్రత పెంచడం గమనార్హం. గతానికి భిన్నంగా జనావాసాల్లోనే గతంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ పాక్‌లో అబోట్టాబాద్‌లోని ఓ రహస్య ప్రాంతంలో తలదాచుకున్నాడు. అది జనావాసాలకు దూరంగా ఉండటంతో అమెరికా దాడులు చేసేందుకు సులువైంది. ఇక మసూద్ అజార్ వంటి ఉగ్రనేతలు కూడా బవహల్‌పూర్ పర్వతాల్లో దాక్కొని అక్కడినుంచే కార్యకలాపాలను సాగిస్తున్నారు. కానీ, వారికి భిన్నంగా హఫీజ్ సయీద్ జనావాసాల మధ్య ఉంటున్నాడు. దీంతో సామాన్య పౌరులకు నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో దాడులకు వెనకడుగు వేయొచ్చనేది పాక్ కుటిల యోచనగా తెలుస్తోంది.

# బాలరాజు విశ్వరూపం

- **ఏం డేరింగ్ బిజినెస్ గురూ..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్ (మే 01):**



ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా చెప్పుకునే ప్రాజెక్టు రూపుదిద్దుకుంటున్న నియోజకవర్గం పోలవరం. 2024 ఎన్నికల్లో ఊహించని విధంగా ఇక్కడ జనసేన జెండా ఎగిరింది. సరైన క్యాడర్ లేకపోయినా.. నడిపించే నాయకులు లేకున్నా... కూటమి వేవ్‌లో, టిడిపి సహకారంతో జనసేన తరపున గెలిచారు చిర్రి బాలరాజు. ఎన్నికలకు అవసరమైన నిధులు సమకూరే వరకు, ఫలితాలు వచ్చే వరకు అందరితో సఖ్యతగా ఉన్నట్టు వ్యవహరించిన బాలరాజు గెలిచాక మాత్రం విశ్వరూపం ప్రదర్శిస్తున్నారట. సొంతగా జట్టును పెట్టుకుని ప్రతి పనికీ పర్సంటేజ్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజకీయ దూరాలోచనతో కాకుండా.... దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న తపన ఆయనలో కనిపిస్తోందని చెప్పుకుంటున్నారు స్థానికంగా. మద్యం షాపుల నుంచి ఇసుక అక్రమ రవాణా వరకు.. పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించడం నుంచి అభివృద్ధి పనుల్లో పర్సంటేజీలదాకా...అన్నింట్లోనూ తన వాటా తనకు చేరేలా ఎమ్మెల్యే జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా పోలవరం నియోకవర్గంలో విలీనమైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఎమ్మెల్యే అనుచరగణం హంగామా ఎక్కువైనట్టు తెలుస్తోంది.పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నష్టపరిహారం మీద కన్నేశారట కుక్కునూరు మండలంలోని ఎమ్మెల్యే మనుషులు. బిల్లులు చెల్లించాలన్నా, నష్టపరిహారం అకౌంట్లో జమకావాలన్నా తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని తెగేసి చెబుతున్నట్టు సమాచారం. అవగాహన కుదరడంతో... అధికార యంత్రాంగం సైతం అక్కడ మండల స్థాయి నాయకుల మాటకే ప్రాధాన్యం ఇస్తోందని, నష్టపరిహారం అకౌంట్లలో పడాలంటే ముందు ఫలానా వాళ్ళని కలవమని సూచిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. విలీన మండలాలతోపాటు నియోజకవర్గంలోని మిగతా చోట్ల ఇదే తంతు కొనసాగుతున్న సమయంలోనే...పోలవరం నిర్వాసితులను దళారులు దోచేస్తున్నారంటూ ఎమ్మెల్యే మాట్లాడ్డం కామెడీగా ఉందంటూ తెలుగుదేశం నేతలే చెవులు కొరుక్కుంటున్నారట. తమకి దక్కాల్సిన సీటును పొత్తులో త్యాగం చేసి దగ్గరుండి గెలిపిస్తే.. చివరికి మమ్మల్నే దగ్గరికి రానివ్వడంలేదనేది మిగతా మండలాల టీడీపీ నాయకుల బాధగా తెలుస్తోంది. అవకాశం వచ్చింది బాగుపడటానికేగాని బాగోగులు తెలుసుకోడానికి కాదన్నట్టు ఎమ్మెల్యే అండ్ గ్యాంగ్ తయారయ్యారంటూ సీరియస్‌గా ఉన్నారట తెలుగు తమ్ముళ్లు. అధికారిక కార్యక్రమాల్లో కలసి ఎమ్మెల్యేకి ఏదన్నా చెప్పుకుందామనుకుంటే... అసలు ఆహ్వానాలే అందట్లేదట. కలిసొచ్చిన అదృష్టాన్ని విచ్చలవిడిగా వాడేద్దామనుకుంటున్న జనసేన ఎమ్మెల్యే అండ్‌కో ఇప్పుడు టీడీపీ లీడర్స్‌ని పక్కకు నెట్టేసి... అధికార యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకుని కథ నడిపించేస్తున్నారట. ప్రాజెక్ట్ నిర్వాసితులకు చెందాల్సిన భూములను తక్కువ రేట్లకు లీజుకు తీసుకున్నవారి విషయంలో సెటిల్మెంట్లు చేయడం ఒక ఎత్తైతే.. ఎమ్మెల్యే అనుచరవర్గం చెప్పింది చెప్పినట్టు చేస్తున్న కొందరు అధికారులు... మేం నిండా మునిగిపోతున్నామని వాపోతున్నా పట్టించుకునేవారే లేరట. ఎవరన్నా కాదు కూడదని అంటే... బెదిరిస్తున్నట్టు సమాచారం.ఇటీవల ఎమ్మెల్యే అనుచరవర్గం జీలుగుమిల్లి ఇంఛార్జి ఎమ్మార్వోని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను కొట్టేశారన్న ఫిర్యాదు అందింది. దానిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు చివరికి ఇన్ఛార్జి ఎమ్మార్వోని సస్పెండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే అనుచరుల ధనదాహానికి తామెక్కడ బలవుతామోనన్న టెన్షన్ పెరుగుతోందట అధికారుల్లో. మొత్తానికి పోలవరం జనసేన ఎమ్మెల్యే.... కలిసొచ్చిన అదృష్టాన్ని.... బాగా... గట్టిగానే.... సద్వినియోగం చేసుకుంటున్నారన్న చర్చ నడుస్తోంది పోలవరంలో. నిత్యం జనంలో ఉండి మిగతా నేతలకు ఆదర్శంగా నిలబడండంటూ జనసేన అధినేత ఇచ్చిన పిలుపును పోలవరం నేతలు కాస్త తేడాగా అర్థం చేసుకున్నారంటూ సెటైర్స్ పడుతున్నాయి. ఏం డేరింగ్ బిజినెస్ గురూ... అంటూ ఎకసెక్కాలాడుతున్నా పట్టించుకునే స్థితిలో లేరట పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.




## కన్నుల పండుగగా అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు

**జర్నలిస్ట్ డైరీ, సరూర్ నగర్ (మే 01) :**

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29 వ (ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలను నాల్గవ గురువారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్తలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 8 గంటలకు "ఎదురుకోలు ఉత్సవం" మంగళాశాసనము, తీర్థప్రసాద గోష్ఠి, గురువారం ఉదయం 9 గంటలకు హయగ్రీవ ఇష్టి, 9.30 నిమిషాలకు నిశాచూర్ణోత్సవము (పసుపు కొట్టుట) ఉత్సవ మూర్తులకు అభిషేకము, ఉదయం 10 గంటలకు "హనుమత్ వాహనసేవ" లాంటి సేవలను ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియ జేశారు. అలాగే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మంచినీరు, మజ్జిగ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరీశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, తమన్నా శ్రీధర్, రామ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# వయో వృద్ధులకు డిజిటల్ కార్డ్

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్ (మే 01):**




సీనియర్ సిటిజన్ డిజిటల్ కార్డును పొందడానికి 60 ఏళ్లు నిండిన పురుషులు మరియు 58 ఏళ్ళు నిండిన మహిళలు అర్హులు. ఈ డిజిటల్ కార్డులపై ఆ వ్యక్తి యొక్క బ్లడ్ గ్రూప్ మరియు అత్యవసర సంప్రదింపు నెంబర్లు కూడా ఉంటాయి. ఈ డిజిటల్ కార్డుల కోసం అర్హులైన వయోవృద్ధులు సచివాలయం కు వెళ్లి పాస్పోర్ట్ ఫోటో, ఆధార్, కుల ధ్రువ పత్రం, బ్యాంకు ఖాతాతో రూ.40 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఈ డిజిటల్ కార్డు పొందిన వాళ్లు ప్రభుత్వ పథకాలలో రాయితీ అలాగే రవాణా సౌకర్యాలు, బ్యాంకింగ్ ప్రయోజనాలను పొందగలుగుతారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం వయోవృద్ధులను దృష్టిలో పెట్టుకొని వాళ్లకు అనేక సౌకర్యాలను కలిగించేందుకు ముందుకు అడుగులు వేస్తుంది. తాజాగా కూటమి ప్రభుత్వం ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ మరియు వార్డు సచివాలయాల ద్వారా వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులను డిజిటల్ రూపంలో అందించేందుకు అన్ని పనులను ప్రారంభించింది.ఈ డిజిటల్ గుర్తింపు కార్డు 60 ఏళ్ళు నిండిన పురుషులకు మరియు 58 ఏళ్లు నిండిన మహిళలకు ప్రభుత్వం జారీ చేస్తుంది. అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలలో అనేక రకాల సేవలను పొందడానికి వయోవృద్ధులకు ఈ కార్డు చాలా ఉపయోగపడుతుంది. సీనియర్ సిటిజనులకు ఇది ఒక గుర్తింపు పత్రం గా మాత్రమే కాకుండా ఈ కార్డులో అనేక ముఖ్యమైన సమాచారం కూడా ఉంటుంది. ఈ డిజిటల్ కార్డుపై ఆ వ్యక్తి యొక్క బ్లడ్ గ్రూప్ తో పాటు వాళ్ళ అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు కూడా ప్రత్యేకంగా పొందుపరచడం జరిగింది.డిజిటల్ కార్డు పై ఉన్న ఈ వివరాలు వారికి ఏదైనా ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితి ఏర్పడిన సందర్భంలో వచ్చిన సహాయం అందించడానికి చాలా ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. అర్హులైన వయోవృద్ధులు ఈ డిజిటల్ కార్డును పొందడం చాలా సులభం. వాళ్లు తమ పాస్పోర్ట్ సైజు ఫోటోతో పాటు ఆధార్ కార్డు అలాగే బ్యాంకు ఖాతా వివరాలు మరియు కుల ధ్రువపత్రం వంటివి తీసుకొని వెళ్లి తమకు సమీపంలో ఉన్న గ్రామా లేదా వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కార్డు పొందడానికి నామమాత్రపు రుసుము రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మీ ఆధార్ కార్డుతో అనుసంధానం అయ్యి ఉన్న మొబైల్ ఫోన్ కూడా తీసుకొని వెళ్ళాలి. ఈ పత్రాలన్నీ తీసుకొని వెళ్తే మీకు కేవలం 10 నిమిషాలలో ప్రక్రియ పూర్తి అవుతుంది.

# పాక్ మరో ఎత్తుగడ..

- **ఐఎస్ఐ చీఫ్‌కు కీలక బాధ్యతలు**

**జర్నలిస్ట్ డైరీ, అంతర్జాతీయం (మే 01):**



పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ చీఫ్‌ను దేశ జాతీయ భద్రతా సలహాదారుగా నియమిస్తూ అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గాం దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఉగ్రదాడికి ప్రతీకారంగా తమపై న్యూఢిల్లీ ఏ క్షణమైనా దాడులు చేపట్టొచ్చని పాక్ భయపడుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ ఆసిమ్ మాలిక్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను జాతీయ భద్రతా సలహాదారుగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అధికారిక నోటిఫికేషన్ కూడా జారీ చేసినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. మాలిక్‌కు ఎన్ఎస్ఏ చీఫ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆయనను గతేడాది సెప్టెంబరులో ఐఎస్ఐ చీఫ్‌గా నియమించారు. నిఘా సంస్థ అధిపతి కంటే ముందు.. పాక్ ఆర్మీ జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో అడ్జుటంట్ జనరల్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మిలిటరీ అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలను పర్యవేక్షించారు. పాక్ సైన్యంలో మాలిక్ అడ్జుటంట్ జనరల్‌గా పనిచేస్తున్నప్పుడే మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు.. ఆయన మద్దతుదారుల ఆందోళనలపై ఆర్మీ అణచివేత వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో బలోచిస్థాన్, దక్షిణ వజీరిస్థాన్‌లో ఆర్మీ డివిజన్లకు నాయకత్వం వహించారు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని కఠినంగా ముందుకుసాగుతాడని మాలిక్‌కు పేరుంది. అలాంటి వ్యక్తికి ఇప్పుడు జాతీయ భద్రతా సలహాదారుగా పాక్ అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం దాడికి పాక్ సీమాంతర ఉగ్రవాదమే కారణమన్న భారత్.. దాయాదితో దౌత్య సంబంధాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఇటీవల త్రివిధ దళాలతో కీలక సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ.. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని' అని స్పష్టం చేసినట్లు సమాచారం.

# గోదావరి జిల్లాలపై కమలం గురి

- **ఇది భీమవరానికి ఒక గర్వకారణమైన రోజు**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్ (మే 01):**



ఇద్దరు సీనియర్ నేతలకు బిజెపి హైకమాండ్ ఇచ్చిన గుర్తింపు ఇది. ఇది భీమవరానికి ఒక గర్వకారణమైన రోజు అని అక్కడి ప్రజలు చెబుతున్నారు.గత కొన్నేళ్లలో భీమవరం ఆర్థికంగా చాలా ఉచ్చస్థితికి చేరుకుంది. అక్కడి రాజులు ఏం చెబితే అది ఢిల్లీ స్థాయిలో జరిగిపోవాల్సిందే. వాళ్ల పలుకుబడి ఆరేంజ్‌కు వెళ్ళిపోయింది. క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన కృష్ణంరాజు బిజెపి నుంచి ఎంపీగా కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే భీమవరం రాజులు బిజెపికి దగ్గరయ్యారు. కృష్ణంరాజు తమ్ముడు కొడుకు ప్రభాస్ బాహుబలితో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాక ప్రధాని మోదీ ఆయనను పిలిచి మరీ అభినందించారు. భీమవరం ప్రాంత రాజుల పలుకుబడి గుర్తించిన ప్రధాని మోదీ ఎలాగైనా ఆంధ్రప్రదేశ్‌లో బలపడాలని చూస్తున్న బిజెపికి క్షత్రియ సామాజిక వర్గాన్ని ఒక అవకాశంగా చూపించారు అంటారు. ఏపీలో బలమైన చౌదరి, రెడ్డి, కాపు సామాజిక వర్గాలు పార్టీలపరంగా విడిపోయి ఉన్నాయి. వారిలాగే ఆర్థికంగా రాజకీయంగా పలుకుబడి ఉన్న క్షత్రియ సామాజిక వర్గాన్ని బీజేపీ వైపు ఆకర్షించే పనిలో కమలనాథులు పావులు కదిపారు. అందుకే భీమవరం రాజులు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని భీమవరంలో ప్రతిష్టిస్తే ఏకంగా ప్రధాని మోదీనే ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. తర్వాత 2024 ఎన్నికలు వచ్చేసరికి కావాలని కూటమిలో పట్టుబట్టి మరీ నర్సాపురం ఎంపీ సీటును సాధించుకున్నారు. అక్కడ నుంచి క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస వర్మను పోటీలో నిలబెట్టి గెలిపించి కేంద్రమంత్రిని చేశారు బిజెపికి అగ్రవర్ణాల పార్టీగా ఒక పేరు ఉంది. దాన్ని చెరిపేసుకోవడానికి అన్నట్టు బీసీ సామాజిక వర్గానికి చెందిన పాక సత్యనారాయణను హఠాత్తుగా ఎంపీని చేసింది బిజెపి. విజయసాయి రెడ్డి రాజీనామా చేశాక ఖాళీ అయిన స్థానాన్ని టిడిపి జనసేనతో పోటీ పడి మరీ దక్కించుకున్న బిజెపి పార్టీకి ఎప్పటి నుంచో కట్టుబడి ఉన్న వ్యక్తిగా పేరు ఉన్న పాకా సత్యనారాయణకు ఆ పదవి కట్టబెట్టింది. దీంతో ఒకే పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు ఎంపీ పదవులు ఇచ్చిన పార్టీగా భీమవరం పరిసర ప్రాంతాల్లో గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నంలో బిజెపి ఉంది. అలాగే క్షత్రియ బీసీ వర్గాలకు చెందిన వ్యక్తులకు కీలక పదవులు ఇచ్చామని ప్రచారం కూడా చేసుకుంటుంది. వీళ్ళు మాత్రమే కాదు కాపు సామాజిక వర్గానికి చెందిన సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని మరొక బలమైన సామాజిక వర్గాన్ని కూడా దగ్గర చేసుకునే ప్రయత్నంలో బిజెపి నేతలు తలమునకలై ఉన్నారు.ఈ లెక్కలన్నీ పక్కన పెడితే ఒకే పట్టణానికి చెందిన ఇద్దరు నేతలకు ఒకే పార్టీ ఎంపీ సీట్లు ఇవ్వడం ఏపీలో హాట్ టాపిక్ అయింది. మరి ఆ ఇద్దరు కీలక నేతలు భీమవరానికి కేంద్రం నుంచి ఎలాంటి తాయిలాలు సాధించుకు వస్తారో చూడాలి.



## హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- **కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (మే 01) :**

మేడే దినాన్ని పురస్కరించుకొని మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ సంఘటితమై హక్కుల కోసం పోరాడాలని అందరూ ఏక తాటిపైకి కలసి రావాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు పిలుపునిచ్చారు. మేడే సందర్భాన్ని పురస్కరించుకొని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుండి మెయిన్ రోడ్, మహబూబ్ నగర్ రోడ్డు, పరిగి రోడ్డు, బ్లాక్ ఆఫీస్ వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం వద్ద జెండాను రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంతో పాటు జిల్లాలోని, రాజ్యంలో పలు ప్రాంతాల్లో విస్తరిస్తున్న సంక్షేమ సంఘం కార్మికుల శ్రేయస్సు కోసం నిత్యం శ్రమిస్తుందని అన్నారు. శ్రమ దోపిడీని ఎదిరించి శ్రమ శక్తి గెలుపొందిన మహోజ్వల చారిత్రాత్మక దినం అని, మన హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని, ప్రస్తుతం కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ, కార్మిక వర్గానికి నష్టం చేస్తున్నాయని, యాజమాన్యాల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. వీటిని కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తమ కష్టంతో ప్రగతి పూర్వక సమాజ నిర్మాణానికి చేయూతనిచ్చే శ్రామికుల హక్కులను కాపాడటంలో కార్మిక సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఇందులో భాగంగా కార్మిక సంక్షేమానికి సంఘం పెద్ద పీట వేసామని, రాష్టంలో సామాజిక దృక్పథంతో ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా కార్మిక సేవా ధ్యేయంగా నడుస్తున్న సంఘం కేవలం కార్మిక సంక్షేమ సంఘం అని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కార్మికులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి రాజేష్, కార్యనిర్వహక అధ్యక్షులు కుమార్, కార్మిక నేతలు రాఘవేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, రేణు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**జర్నలిస్ట్ డైరీ, పాలేరు (మే 01)**

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ లు వరమని బీఆర్ఎస్ అధ్యక్షులు రంగాపురం బాలకృష్ణ గౌడ్ అన్నారు. తిరుమలయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన వీరబోయిన లింగయ్య ఇటీవల అనారోగ్యం బాధపడుతూ సర్జరీ చేయించుకోగా, మాజీ ఏమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సూచన మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సిపారసుతో రూ.31,500 సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం బాధితునికి తన నివాసంలో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బాణాల బస్వా రెడ్డి, సౌడోజు రవీంద్ర చారి, రంగాపురం రవి, జంపాల రమేష్, తిరుమలరెడ్డి, రవీందర్ రెడ్డి, మందుల ఎల్లయ్య, సామ బిక్షంరెడ్డి, కందాళ సురేందర్ రెడ్డి, పేర్ల సంపత్, పేర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులకు ఇళ్లను మంజూరు చేయాలి

- **మండల ఎంపీడీఓను కోరిన నిజమైన ఇందిరమ్మ లబ్ధిదారులు**

**జర్నలిస్ట్ డైరీ, పాలేరు (మే 01)**

తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు అసలైన అర్హులకు ఇవ్వాలని మండల ఎంపీడీవో ఎస్కే సిలార్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శి నికిల్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాణి, నాగమణి, రేణుక, కుమారి, సుకన్య, ధనమ్మలు మాట్లాడుతూ.. గ్రామంలో తాము నివసించడానికి కనీసం రేకులతో కూడా ఇండ్లు లేవని, తాటి ఆకులతో గుడిసెలలో జీవిస్తున్నామని, తమకంటూ వ్యవసాయ భూమి ఏమీ లేదని అన్నారు. తామే నిజమైన లబ్ధిదారులమని, తమకు ఇల్లు మంజూరు చేయాలని, గ్రామంలో అన్ని సౌకర్యాలు ఉన్న వారికే ఇండ్లు మంజూరు చేసారని అన్నారు. అందుకే గ్రామంలో ఇందిరమ్మ కమిటీల పేరుతో జరిగిన లబ్ధిదారుల ఎంపిక అర్హత లేనీ ఎంపిక అని, ప్రభుత్వమే నేరుగా నిజమైన లబ్ధిదారులు గుర్తించాలని, తమకు న్యాయం చేయాలని మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారిని కోరినట్లు తెలిపారు. తక్షణమే గ్రామంలో రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పేదలైన తమకు ఇండ్లు ఇవ్వకుండా, గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూములు ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## నేడు షాదీ ముబారక్.. కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

**జర్నలిస్ట్ డైరీ, సరూర్ నగర్ (మే 01) :**

నేటి ఉదయం 10 గంటలకు తహశీల్దార్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో సరూర్ నగర్ మండల కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లకు సంబందించిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు మండల తహశీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా రెండు డివిజన్ల కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి, ఆకుల శ్రీవాణి పాల్గొంటారని ఆయన వివరించారు.



## పూజాహెగ్డే యాక్టింగ్‌పై కామెంట్స్..

సూర్య, పూజాహెగ్డే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజు దర్శకుడు. గురువారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే కార్తిక్ సుబ్బరాజు, చిత్ర సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అభిమానులతో కలిసి సినిమా వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా ఓ విలేకరి.. ''పూజాహెగ్డే యాక్ట్ చేస్తే ఆ సినిమా ఫ్లాప్ అవుతుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానిపై మీ అభిప్రాయం ఏమిటి?'' అని ప్రశ్నించాడు. దీనిపై సంతోష్ నారాయణన్ స్పందిస్తూ.. అది కేవలం వారి ఊహ మాత్రమేనని అందులో ఎలాంటి నిజం లేదని అన్నారు. తమ చిత్రానికి వస్తోన్న రెస్పాన్స్ చూస్తుంటే సంతోషంగా ఉందని కార్తీక్ సుబ్బరాజు తెలిపారు. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. తమ చిత్రానికి సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం ఒక బలమైందని పేర్కొన్నారు.

దర్శకుడిగా కార్తిక్ సుబ్బరాజుకు కోలీవుడ్‌లో మంచి పేరు ఉంది. 'పిజ్జా', 'జిగర్తాండ', 'పేట' వంటి చిత్రాలను ఆయన తెరకెక్కించారు. తొలిసారి ఆయన సూర్యతో కలిసి వర్క్ చేసిన చిత్రమే 'రెట్రో'. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఇది సిద్ధమైంది. లవ్.. లాఫ్టర్.. వార్.. ధర్మం.. వంటి విభాగాల్లో ఈ కథను ప్రేక్షకులకు అందించారు. ఇందులో పూజాహెగ్డే రుక్మిణి పాత్రలో నటించారు. అయితే ఈ సినిమాలో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె తాజాగా ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ఈ పాత్రలో భాగం కావడాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకున్నానని అన్నారు.

'మూగముడి' అనే కోలీవుడ్ చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు పూజాహెగ్డే. సుమారు 13 ఏళ్ల కెరీర్‌లో దక్షిణాదితోపాటు హిందీ చిత్రాల్లోనూ ఆమె యాక్ట్ చేశారు. కెరీర్ ఆరంభించింది తమిళంలోనే అయినప్పటికీ ఇప్పటివరకూ అక్కడ ఆమె చేసింది మూడు చిత్రాలు మాత్రమే. 2022లో విడుదలైన 'బీస్ట్'పై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ చివరకు నిరాశే మిగిలింది. మరోవైపు, ఇటీవల ఆమె నటించిన చిత్రాలు వరుస పరాజయాలు అందుకున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో 'కూలీ' (స్పెషల్ సాంగ్ అని టాక్), 'జన నాయగన్', 'కాంచన 4' వంటి తమిళ చిత్రాలు ఉన్నాయి.

## ప్రేక్షకుల్నీ.. నన్నూ వేరుగా చూడొద్దు!

'అబ్‌కీ బార్... అర్జున్ సర్కార్' అంటూ ప్రేక్షకుల్ని ఊరిస్తూ వచ్చారు కథానాయకుడు నాని (Nani). ఆయన నిర్మాణంలో, ఆయనే కథానాయకుడిగా తెరకెక్కిన 'హిట్ 3' కోసమే ఇదంతా! విభిన్నమైన కథలతో ప్రయాణం చేసే నాని... ఈసారి సొంత ఫ్రాంచైజీలో భాగమై 'హిట్ 3'లో నటించారు. అర్జున్ సర్కార్ అనే పోలీస్ అధికారిగా తన నటనలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నారు. శైలేశ్ కొలను (Sailesh Kolanu) దర్శకత్వం వహించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం నాని హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

**'హిట్' ఫ్రాంచైజీలో ఇదివరకు వచ్చిన సినిమాలతో పోలిస్తే 'హిట్ 3' ప్రత్యేకత ఏమిటి?**

ఒక హత్య కేసుని తెరపైకి తీసుకొచ్చి... ఇది చేసింది వీళ్లా? లేక వాళ్లా? అంటూ అనుమానాల్ని రేకెత్తిస్తూ, చివర్లో ఎవరో చెప్పే సినిమా కాదు ఇది. ఇది వేరే ప్రపంచంలో జరిగే కథ అని, తొలి రెండు సినిమాల్లా ఉండదని ప్రచార చిత్రాలతోనే చెప్పేశాం. సీటు అంచున కూర్చోబెట్టే సినిమానే కానీ, అది కేవలం అనుభవం పరంగానే. గొప్పగా థియేట్రికల్ అనుభూతిని పంచే సినిమా ఇది. అది ప్రేక్షకులకు అర్థం కావడంతోనే టికెట్లు ఇంత వేగంగా బుక్ అవుతున్నాయి.

**నాని సినిమా అంటే అందరూ చూసేలా ఉంటుందనే ఓ అభిప్రాయం. ఆ ఇమేజ్‌పై ఇందులోని హింస కోణం ప్రభావం చూపించదా?**

ఇదొక ప్రత్యేకమైన జానర్. దీని లక్ష్య ప్రేక్షకులు వేరు. వాళ్లని ఉద్దేశించి తీసిన సినిమానే ఇది. పిల్లల్ని ఈ సినిమాకి దూరంగా ఉంచాలి. మా అబ్బాయికి ఈ సినిమా ప్రచార చిత్రాల్ని కూడా చూపించలేదు. అన్ని సినిమాలు అందరికోసం తీయలేం. లక్ష్య ప్రేక్షకుల కోసం తీసిన సినిమాతో వాళ్లని మెప్పించినా చాలు.. సినిమా పెద్ద విజయం సాధిస్తుంది. ఇందులో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి. ఓ క్రైమ్ థ్రిల్లర్ చూసిన అనుభూతిని పంచుతూనే, ఎక్కడ భావోద్వేగాలు పంచాలో అక్కడ పంచుతుంది. పోలీసు కథల్లో చాలా



వరకు వ్యక్తిగత కోణం కనిపిస్తుంది. కానీ ఇందులో ఇచ్చిన మాట కోసం అనే అంశం కీలకం. ఆ మాట కోసం ఎంత దూరం వెళ్లాడన్నది ఆసక్తికరం. దర్శకుడు శైలేశ్ ఈసారి కథని ఇంకా బాగా చెప్పాడు. కథానాయిక శ్రీనిధి శెట్టి (Srinidhi Shetty) సహా, ఇందులోని ప్రతి పాత్రకీ ఓ బలమైన కారణం ఉంటుంది. ఛాయాగ్రాహకుడు సాను వర్గీస్ తన విజువల్స్‌తో గొప్పగా కథ చెబుతాడు. మిక్కీ జె.మేయర్ ఎప్పుడూ థ్రిల్లర్ సినిమాలు చేయలేదు. ఆయన సమకూర్చిన సంగీతం ఓ కొత్త అనుభూతిని పంచుతుంది.

**పక్కింటి కుర్రాడి తరహా పాత్రలు మొదలుకొని... ఇప్పుడు యాక్షన్ సినిమాలతో ప్రయాణం చేశారు. ఈ మార్పు కష్టం అనిపించిందా?**

ఎప్పటికప్పుడు కొత్త నేపథ్యంతో కూడిన సినిమాలతో ప్రయాణం చేస్తున్నా. ఇది ట్రాన్స్‌ఫార్మేషన్‌గా కూడా నేను చూడటం లేదు. 'జెర్సీ', 'దసరా', 'హాయ్ నాన్న', 'హిట్ 3' (Hit 3) ఇలా భిన్నమైన కథల్ని ఎంచుకున్నా. ఇలా ఎప్పటికప్పుడు కొత్త రకమైన కథల్ని ఎంచుకోవడం, ఆ పాత్రలకి తగ్గట్టుగా ఒదిగిపోవడం నాకు కష్టంగా ఎప్పుడూ అనిపించలేదు. ఇష్టం లేకపోతే కష్టం కానీ, ఆస్వాదిస్తూ పనిచేస్తే తిరుగు ఉండదు. నాకు (Nani) చేసిన పనిని మళ్లీ చేయాలంటేనే కష్టం. సెట్లో సన్నివేశాలకు అనుగుణంగా సంభాషణలు చెప్పడాన్ని చాలా ఆస్వాదిస్తా. ఒకొక్క రోజు నిద్ర లేకుండా పనిచేసినా ఇబ్బంది అనిపించదు. అదే సన్నివేశాలకి మరోసారి డబ్బింగ్ థియేటర్‌కి వెళ్లి డబ్బింగ్ చెప్పాలన్నప్పుడు చాలా అలసిపోతుంటా.

**ప్రేక్షకులు ఈ మధ్య థియేటర్లకి రావడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి కదా...**

తరచూ వినిపించే మాట ఇది. థియేటర్‌కి వెళ్లి చూడాలనే ఆత్రుతని మన సినిమా కలిగిస్తే ప్రేక్షకులు థియేటర్‌కి ఎందుకు రారు? కచ్చితంగా వస్తారు. అప్పుడప్పుడూ ఒక నెలపాటు థియేటర్ల దగ్గర హడావుడి తగ్గిందనగానే 'ప్రేక్షకులు థియేటర్లకి రావడం లేదు' అంటుంటారు. అలాంటిదేమీ ఉండదు. వాళ్లు మంచి సినిమా వచ్చిన ప్రతిసారీ తప్పకుండా థియేటర్‌కి వస్తున్నారు. నేనూ ప్రేక్షకుల్లో ఒకడినే. వాళ్ల నుంచి నన్ను ఎప్పుడూ వేరుగా చూడొద్దంటుంటా. ప్రేక్షకుల్లో ఒకడిగా ఉంటూనే, నిజాయతీగా సినిమాలు చేసుకుంటూ వస్తున్నా.

**చిరంజీవితో (Chiranjeevi) మీరు నిర్మించబోయే సినిమా సంగతులేమిటి?**

చిరంజీవి సినిమాకి నేను నిర్మాతనే అనే విషయం ఇంకా నమ్మశక్యంగా లేదు. అది కూడా నా శైలిలోనే ప్యాషన్‌తో చేయనున్న సినిమా. ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నా.

**చిరంజీవితో మీరు నిర్మించబోయే సినిమా సంగతులేమిటి?**

చిరంజీవి సినిమాకి నేను నిర్మాతనే అనే విషయం ఇంకా నమ్మశక్యంగా లేదు. అది కూడా నా శైలిలోనే ప్యాషన్‌తో చేయనున్న సినిమా. ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నా.

**నిర్మాతగా బాగా రాణిస్తున్నారు. దీని వెనక రహస్యం ఏమిటి?**

సరైన కథల్ని ఎంపిక చేసుకోవడంతోనే బయట పడుతున్నా. ప్యాషన్ కారణంగా నిర్మాణ వ్యయం విషయంలో నేను వెనకాడను. ఏది కావాలంటే అది ఇచ్చేస్తుంటా. నాని అనే పేరు తోడు కావడం, మార్కెట్ పరంగా అన్నీ ఫలితాన్నిచ్చాయి కాబట్టి సంతోషం. నేను నాని కాకపోయి ఉంటే, ఇప్పుడు నేను తీసినట్టే వేరొకరు సినిమా తీస్తే కచ్చితంగా డబ్బు పోయేది.

### ఇలాంటి రోజు వస్తుందని ముందే భయపడ్డా:

## తాప్సీ వ్యాఖ్యలు



సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మిషా అగర్వాల్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో తనని అనుసరించే వారి సంఖ్య తగ్గిందనే కారణంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని మిషా కుటుంబసభ్యులు వెల్లడించారు. దీంతో మిషా మృతి వార్త అంతటా తీవ్ర చర్చకు దారి తీసింది. దీనిని ఉద్దేశించి బాలీవుడ్ నటి తాప్సీ పన్ను స్పందించారు. ఇలాంటి ఒక రోజు వస్తుందని తాను ముందే భయపడ్డానని అన్నారు.

''ప్రస్తుతం సోషల్‌మీడియాపై ప్రతిఒక్కరికి ఉన్న వ్యామోహం చూసి ఇలాంటి రోజు వస్తుందని నేను ఎప్పుడో భయపడ్డా. జీవితాన్ని మనం ప్రేమించడం కంటే ఫాలోవర్స్ సంఖ్యకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తామని.. చుట్టూ ఉన్నవారు చూపించే నిజమైన ప్రేమ కంటే ఆన్‌లైన్ ప్రేమకే మొగ్గు చూపుతామని భయపడ్డా. అదేవిధంగా మనం కష్టపడి ఎన్నో ఏళ్లపాటు చదువుకున్న డిగ్రీలను లైకులు, కామెంట్స్ అధిగమిస్తాయని ఊహించా. ఈరోజు ఇలాంటి ఘటనను చూడటం నిజంగా బాధాకరం. నా హృదయం ముక్కలైంది'' అని తాప్సీ పోస్ట్ పెట్టారు.

మిషా అగర్వాల్ (24) ఏప్రిల్ 24న మృతి చెందింది. ఆమె మరణ వార్తను ఇన్‌స్టా వేదికగా కుటుంబసభ్యులు వెల్లడించారు. 'లా' చదువుకున్న ఆమె కెరీర్‌లో స్థిరపడాలని ఎన్నో కలలు కందని చెప్పారు. ''లాయర్ కావాలనుకున్న మిషా.. ఒక దశలో ఇన్‌స్టాగ్రామ్‌పై ఆసక్తి పెంచుకుంది. రీల్స్, పోస్టులతో ఫాలోవర్స్‌ను సొంతం చేసుకుంది. ఫాలోవర్స్ సంఖ్యను ఒక మిలియన్‌కు చేర్చుకోవాలని కలకంది. ఇటీవల కాలంలో తన ఫాలోవర్స్ క్రమంగా తగ్గుతూ వచ్చారు. ఆ విషయాన్ని తాను జీర్ణించుకోలేకపోయింది. కెరీర్ పరంగా దృష్టిసారించలేకపోయింది. ఆ భయంతోనే ఆత్మహత్య చేసుకుంది'' అని కుటుంబ సభ్యులు ప్రకటన విడుదల చేశారు.

### PSL వల్ల మాకు నాణ్యమైన

## ఆటగాళ్లు దొరకట్లేదు



- **పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్**

ఈ ఐపీఎల్ (IPL) సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ (Shreyas Iyer) సారథ్యంలో పంజాబ్ కింగ్స్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్కేను పంజాబ్ (Punjab Kings) 4 వికెట్ల తేడాతో ఓడించింది. 10 మ్యాచ్‌లు ఆడి 13 పాయింట్లతో ఉన్న పంజాబ్ ప్లే ఆఫ్స్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ఆ జట్టును గాయాల బెడద వెంటాడుతోంది. సీజన్ ఆరంభంలో కివీస్ పేసర్ లాకీ ఫెర్గూసన్ తొడ కండరాల గాయంతో టోర్నీ నుంచి వైదొలిగాడు. తాజాగా ఆసీస్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వేలి గాయంతో ఈ ఐపీఎల్ సీజన్‌లో మిగత మ్యాచ్‌లన్నింటికీ దూరమయ్యాడు. చెన్నైతో మ్యాచ్ ముంగిట ప్రాక్టీస్ చేస్తుండగా అతడి వేలు విరిగింది. అయితే, పంజాబ్ ఇంకా వీరిద్దరి స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకోలేదు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో పీఎస్ఎల్ (PSL) జరుగుతోంది. ఐపీఎల్ జరుగుతున్న సమయంలోనే పీఎస్ఎల్‌ను నిర్వహిస్తుండటం వల్ల తమకు రీప్లేస్‌మెంట్‌గా నాణ్యమైన విదేశీ ఆటగాళ్లు దొరకడం లేదని పంజాబ్ కింగ్స్ కోచ్ రికీ పాంటింగ్ (Ricky Ponting) అన్నాడు. భారత్‌లో ఉన్న యువ ఆటగాళ్లను కూడా పరిశీలిస్తున్నామని, త్వరలోనే కొత్త వారిని జట్టులోకి తీసుకుంటామని తెలిపాడు.

'నిజం చెప్పాలంటే రీప్లేస్‌మెంట్‌ల విషయంలో మేం కొంచెం ఓపిగ్గా ఉన్నాం. మ్యాక్స్‌వెల్ గాయపడి రెండ్రోజులే అవుతోంది. లాకీ ఫెర్గూసన్ టోర్నీకి దూరమై రెండు వారాలు దాటింది. పాకిస్థాన్ సూపర్ లీగ్ (PSL) కూడా ఇప్పుడే జరుగుతోంది. చాలా మంది విదేశీ ప్లేయర్లు ఆ లీగ్‌లో ఆడుతున్నారు. దీంతో మాకు రీప్లేస్‌మెంట్ కోసం నాణ్యమైన ఆటగాళ్లు దొరకడం లేదు. దీంతో మేం ఓపికతో ఉంటున్నాం. భారత్‌లోని ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లపై కూడా దృష్టిపెట్టాం. నిన్న చెపాక్‌లో మా జట్టులో శిక్షణ పొందిన కొంతమంది కుర్రాళ్లు మాతో ధర్మశాలకు వస్తారు. మేము వారిని నిశితంగా పరిశీలిస్తాము. వారు పంజాబ్ జట్టు కాంట్రాక్ట్ పొందొచ్చు. ఈ వారంలో రీ ప్లేస్‌మెంట్‌లు పూర్తవుతాయి' అని రికీ పాంటింగ్ వివరించాడు. పంజాబ్ తదుపరి మ్యాచ్‌లో (మే 4, ధర్మశాల) లఖ్‌నవూతో తలపడనుంది.





## ముంబయి డబుల్ హ్యాట్రిక్..

ఐపీఎల్ 18 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ వరుసగా ఆరో విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ కొట్టింది. రాజస్థాన్ రాయల్స్‌ను వారి సొంత గడ్డపై 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 217 పరుగుల స్కోరు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో రాజస్థాన్ 16.1 ఓవర్లలోనే 117 పరుగులకు ఆలౌటైంది. ముంబయి బౌలర్ల ధాటికి రాజస్థాన్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాటపట్టారు. జోఫ్రా ఆర్చర్ (30) టాప్ స్కోరర్. యశస్వి జైస్వాల్ (13), రియాన్ పరాగ్ (16), ధ్రువ్ జురెల్ (11), శుభమ్ దూబె (15), నితీష్ రాణా (9) పరుగులు చేసి వెనుదిరిగారు.

గత మ్యాచ్ సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ ఈ సారి పరుగుల ఖాతా తెరవలేదు. హెట్‌మయర్ కూడా డకౌటయ్యాడు. హెట్‌మయర్ పోరాడకుంటే రాజస్థాన్ 100లోపే ఆలౌటయ్యేది. ముంబయి బౌలర్లలో కర్ణ్ శర్మ 3, ట్రెంట్ బౌల్ట్ 3, జస్‌ప్రీత్ బుమ్రా 2, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు. 11 మ్యాచ్‌ల్లో ఎనిమిదో ఓటమిని చవిచూసిన రాజస్థాన్ (Rajasthan Royals) అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో భారీ విజయం అందుకున్న ముంబయి (14) పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. జైపుర్‌లో ముంబయి 12 ఏళ్ల తర్వాత గెలవడం విశేషం.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయికి ఓపెనర్లు రికెల్‌టన్ (61; 38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (53; 36 బంతుల్లో 9 ఫోర్లు) అర్ధ శతకాలు బాది శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో 11 ఓవర్లకు 108కి చేరింది. తీక్షణ వేసిన తర్వాతి ఓవర్‌లో రికెల్‌టన్ క్లీన్‌బౌల్డ్ కాగా.. రియాన్ పరాగ్ వేసిన 13 ఓవర్‌లో జైస్వాల్‌కు క్యాచ్ ఇచ్చిన రోహిత్ పెవిలియన్ చేరాడు. తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (48*; 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (48*; 23 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగడంతో ముంబయి భారీ స్కోరు సాధించింది. ఫజల్ హక్ ఫారూఖీ వేసిన 18 ఓవర్‌లో హార్దిక్ మూడు ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465